# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

తెలంగాణ | సంపుటి : 2 | సంచిక : 200 | ఎడిటర్ : వి. శ్రీనివాసరావు | పేజీలు :8 | ఆదివారం 12 అక్టోబర్ 2025




## వరంగల్, నల్గొండలో ఇంక్యూబేషన్ కేంద్రాలు

- 'టీ-హబ్' తరహాలో ఏర్పాటు, కొత్త ఆలోచనలకు ప్రోత్సాహం
- 'ఫార్మసీ ఆఫ్ పర్పస్'గా తెలంగాణను మార్చాలన్నదే మా సంకల్పం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- తెలంగాణ ను ఫార్మా,ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్

తెలంగాణను "ఇన్నోవేషన్ హబ్" గా మార్చాలన్నదే తమ సంకల్పమని, వరంగల్, నల్గొండలోనూ టీ-హబ్ తరహాలో ఇంక్యూబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే కాకతీయ, మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయాలతో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లుగా వివరించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అలుమ్ని' గోల్డెన్ జూబ్లీ వేడుకలను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైన్స్ కు మానవత్వాన్ని జోడిస్తే ప్రతి ఆవిష్కరణ సమాజహితానికి బాటలు వేస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణను - మిగతా3లో

## ఐకానిక్ బిల్డింగ్‌గా టీ స్క్వేర్



- ఏఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలి
- ఏఐ హబ్,టీ స్క్వేర్ పైన సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- టీ స్క్వేర్ నిర్మాణంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి
- పార్కింగ్ కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి
- టీ స్క్వేర్ లో ఆపిల్ లాంటి ఇంటర్నేషనల్ బ్రాండ్స్ తమ ఔట్లెట్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్

టీ స్క్వేర్ భవనం అనేది ఐకానిక్ బిల్డింగ్‌లా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. దీనికి సంబంధించి నవంబర్ నెల చివరి నుంచి పనులు ప్రారంభం కావాలని ఆదేశించారు. ఈరోజు(శనివారం, అక్టోబర్ 11వ తేదీ) ఐసీసీలో ఏఐ హబ్ టీ స్క్వేర్ పై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. దీనికి మంత్రి శ్రీధర్‌బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, టీజేఐఐసీ ఎండీ శశాంక, - మిగతా3లో

## 'నేనెప్పుడూ అలా అనలేదు'

మీడియాపై డీకే శివకుమార్ సీరియస్

నేను ముఖ్యమంత్రిని అయ్యే సమయం దగ్గరపడుతోంది అని నేను ఎక్కడా అనలేదు

కొంత మంది నేను సీఎం కావాలి అంటూ నినాదాలు చేస్తూ హడావిడి చేస్తున్నారు


కానీ, నా తలరాత ఏంటో నాకు తెలుసు. నాకేం తొందరలేదు

## వ్యవసాయ ఎగుమతులు రెట్టింపు



- రైతుల శ్రేయస్సు కోసం లెక్కలేనన్ని సంస్కరణలు తెచ్చాం
- రైతులకు గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసేందేమీ లేదు
- 2004 నుంచి 2014 వరకూ యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది
- గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుంది
- రైతుల ఆదాయం పెంచేందుకు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చింది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

## బీహార్‌లో 100 స్థానాల్లో పోటీకి ఎంఐఎం సిద్ధం!



- గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఐదురెట్లు ఎక్కువ స్థానాల్లో పోటీకి దిగుతున్నాం
- రాష్ట్రంలో ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ కూటములకు ప్రత్యామ్నాయంగా మూడో రాజకీయ శక్తిగా ఎదగడమే తమ లక్ష్యం
- మా సత్తాను ప్రత్యర్థులకు చూపిస్తాం.. మా బలాన్ని తక్కువ అంచనా వేయలేరు"

## బనకచర్ల డీపీఆర్ అప్రైజల్‌పై సీఎం ఎందుకు స్పందించడం లేదు?

- 463 టీఎంసీలు నీళ్లు గోదావరి నుండి కృష్ణా నదికి ఆంధ్రప్రదేశ్ మళ్లిస్తుంది
- మేము ఆల్మట్టిలో 112 టీఎంసీలు ఆపుకుంటామని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది.
- ఏపీ 463 టీఎంసీల నీళ్లు మళ్లిస్తే నేను మీద 112 టీఎంసీలు ఆపుకుంటా అని కర్ణాటక అంటుంది
- నేను 74 టీఎంసీలు ఆపుకుంటా అని మహారాష్ట్ర అంటుంది.
- మన దేశంలో సెంట్రల్ వాటర్ కమిషన్ నిబంధనలు, రాజ్యాంగం పరంగా వరద జలాల మీద డీపీఆర్ అప్రైజల్ జరగదు




హైదరాబాద్

బనకచర్ల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకించడం లేదు..? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల డీపీఆర్ అప్రైజల్‌పై సీఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదని హరీశ్‌రావు నిలదీశారు. బనకచర్ల ప్రాజెక్టుపై హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్ టెక్నో ఎకనమిక్ అప్రైజల్ ప్రాసెస్ కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ లేఖ రాశారు. 20 రోజుల కింద సీఆర్ పాటిల్ ఈ లేఖ రాసినా రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు - మిగతా3లో



## అరట్టై వాడండి..

- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు
- వాట్సప్ అకౌంట్ పునరుద్ధరణకు సంబంధించి సుప్రీంకోర్టులో ఓ పిటిషన్
- వాట్సప్ లేకపోతే ఏం.. అరట్టై వాడొచ్చు కదా
- వాట్సప్ యాక్సెస్ ఉండటం ప్రాథమిక హక్కు ఎలా అవుతుంది?
- కమ్యూనికేషన్ కోసం ఇతర యాప్‌లు కూడా ఉన్నాయి.. వాటిని ఉపయోగించొచ్చు!

## ఎలా ముందుకెళ్దాం.. ఏం చేద్దాం!

- ఈ నెల 15న కేబినెట్ భేటీ..
- బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవోలను హైకోర్టు రద్దు చేసింది.
- 50శాతం రిజర్వేషన్ల పరిమితిని పాటించాలని, పాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచన
- ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పుపై చర్చించడానికి వేయడానికి ఈ నెల 15న కేబినెట్ సమావేశం
- స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పుపై కేబినెట్ ప్రధాన చర్చ
- హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఉన్న మార్గాలేంటీ అనే అంశంపై చర్చించనున్న కేబినెట్




హైదరాబాద్

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల అంశం రోజుకో మలుపు తిరుగుతోంది. ప్రభుత్వం రిజర్వేషన్లకు సంబంధించి స్పెషల్ జీవోలు తీసుకొచ్చి ఎన్నికలకు సిద్ధమైంది. అటు ఎన్నికల సంఘం సైతం షెడ్యూల్‌తో పాటు నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. అంతా ఎన్నికల మోడ్‌లోకి వెళ్లిన వేళ హైకోర్టు ప్రభుత్వానికి బిగ్ షాక్ ఇచ్చింది. రిజర్వేషన్లను నిలిపివేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. దీంతో హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం ఏ విధంగా ముందుగా సాగుతుందనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ నెల 15న తెలంగాణ కేబినెట్ భేటీ కానుంది. సీఎం రేవంత్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పుపై కేబినెట్ ప్రధానంగా చర్చించనుంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఉన్న మార్గాలేంటీ అనే అంశంపై చర్చించనున్నారు. అదేవిధంగా రిజర్వేషన్ల అంశంపై సుప్రీం కోర్టులో పోరాడేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. సుప్రీంలో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయాలని నిర్ణయించింది. కాగా పాత విధానంలో - మిగతా3లో

# వ్యవసాయ ఎగుమతులు రెట్టింపు

**న్యూఢిల్లీ:** రైతులకు కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసేందేమీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2004 నుంచి 2014 వరకూ యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని వివరించారు. న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం నాడు జరిగిన ప్రత్యేక కృషి ప్రోగ్రాంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా గత నెలలో అమల్లోకి వచ్చిన జీఎస్టీ సంస్కరణతో రైతులు, దేశంలోని గ్రామీణ రంగానికి మరింత ప్రయోజనం చేకూరిందని మోదీ చెప్పారు. రైతుల ఆదాయం పెంచేందుకు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. యూపీఏ పదేళ్లలో రూ.5 లక్షల కోట్లు మాత్రమే సబ్సిడీగా ఇచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయరంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వివరించారు. గత ప్రభుత్వాలకు వ్యవసాయంపై ఎలాంటి విజన్ లేదని విమర్శించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన వివిధ శాఖలు



ఇష్టారీతిలో వ్యవహరించడం వల్ల దేశంలోని వ్యవస్థాయ వ్యవస్థ బలహీనమవుతూ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో మార్పులు చేస్తూ విత్తనాల దగ్గర నుంచి మార్కెట్ వరకూ రైతులకు ప్రయోజనాలు చేకూరే లెక్కలేనని సంస్కరణలు తెచ్చామని చెప్పారు.

వ్యవసాయ ఎగుమతులు రెట్టింపు

దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు రెట్టింపయ్యాయని, ఆహారధాన్యాలు, పళ్లు, కాయగూరల ఉత్పత్తి సుమారు 90 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఇది 64 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండేదని చెప్పారు. 2014 నుంచి తేనె ఉత్పత్తి రెట్టింపు అయిందని అన్నారు. అభివృద్ధి భారతాన్ని కోరుకుంటే ప్రతి రంగంలోనూ ఇండియా బలపడాల్సి ఉంటుందన్నారు. ఏవో కొన్ని సాధించినంత మాత్రాన తృప్తి పడిపోరాదని సూచించారు. వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టినప్పుడే గణనీయమైన ఫలితాలు ఉంటాయన్నారు. ఇవాళ యాస్పిరేషనల్ జిల్లాల్లో ప్రసూతి మరణాలు తగ్గాయని, చైల్డ్ హెల్త్ మెరుగైందని, విద్యాప్రమాణాలు పెరిగాయని చెప్పారు. దీంతో ఈ జిల్లాలు ఇతర జిల్లాల కంటే మెరుగైన రీతిలో దూసుకెళ్తున్నాయని, ఈ మోడల్ ఆధారంగా వ్యవసాయంలో వెనుకబడిన 100 జిల్లాలను అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామని, ఇందువల్ల అవి మరింత మెరుగైన జిల్లాలుగా మారనున్నాయని చెప్పారు.

వెనకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు కూడా వేయించలేదని.. అటువంటి వాటిని తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందన్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, నివాసం, విద్యుత్, రోడ్డు వంటి అన్నిరకాల సదుపాయాలు కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని.. పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయన్నారు.

# కరూర్ తొక్కిసలాట..
# మృతుల కుటుంబాల చెంతకు నటుడు విజయ్?

కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 41 మంది కుటుంబాలను ప్రముఖ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ఆదివారం కలవనున్నట్లు సమాచారం. అయితే బాధిత కుటుంబాల ఇంటింటికి వెళ్లి కాకుండా అందరినీ ఒక ప్రత్యేక వేదికపై విజయ్ కలువనున్నట్లు టీవీకే పార్టీ ప్రకటించింది. ధర్మపురి జిల్లా లో ప్రత్యేక వేదికను సిద్ధం చేస్తున్నారు. విజయ్ తొక్కిసలాటలో మరణించిన 41 మంది కుటుంబాల సభ్యులతో మాట్లాడి పరామర్శించనున్నారు. వారికి ధైర్యం చెప్పనున్నారు. కాగా కరూర్‌లో సెప్టెంబర్ 27న టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఆ ర్యాలీకి జనం ఊహించని రీతిలో తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఆ తొక్కిసలాటలో 41 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. అయితే విజయ్ బాధితులను కలిసే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతను ఏర్పాటు చేయాలని టీవీకే పార్టీ విజ్ఞప్తి చేసింది. అందుకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. వేదిక నుంచి ఒక కిలోమీటరు మేర ప్రజలు ఎవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని పార్టీ వర్గాలు కోరాయి. కేవలం బాధిత కుటుంబాలకు మాత్రమే వేదిక వద్దకు ప్రవేశం ఉంటుందని వారు తెలిపారు.



## నిజంగా శాంతి కోసం కృషి చేసే వ్యక్తులనే ఎంపిక చేస్తాం..
# వైట్‌హౌస్‌కు నోబెల్ కమిటీ కౌంటర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిరాశ ఎదురైన విషయం తెలిసిందే. నోబెల్ శాంతి బహుమతిపై ట్రంప్ పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. ట్రంప్ 'శాంతి' ఆశలపై నీళ్లు చల్లుతూ 2025 నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా ప్రధాన ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మరియా కొరీనా మచాడోకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్‌ను కాకుండా వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడోను నోబెల్ శాంతి బహుమతికి ఎంపిక చేయడంపై వైట్‌హౌస్ అసంతృప్తి వ్యక్తం చేసింది. మచాడోని ఎంపిక చేయడం ద్వారా నోబెల్ కమిటీ శాంతి కన్నా రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించింది. వైట్‌హౌస్ విమర్శలపై నోబెల్ కమిటీ స్పందించింది. 'శాంతి' ప్రకటన విషయంలో నియమ, నిబంధనల ప్రకారమే నడుచుకున్నట్లు తెలిపింది. కమిటీ చైర్మన్ జోర్గెన్ వాట్నే ఫ్రైడ్నెస్ మాట్లాడుతూ.. 'నోబెల్ అవార్డుల ఎంపికకు ముందు అన్నిరకాలుగా పరిశీలన జరుపుతాం. అవార్డు అందుకోవడానికి అన్ని అర్హతలు ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే ఎంపిక చేస్తాం. నోబెల్ పీస్ ప్రైజ్ కోసం ఏటా వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తాయి. వాటన్నింటినీ పరిశీలించి నిజంగా శాంతి కోసం కృషి చేసే వ్యక్తులనే ఎంపిక చేస్తాం. నోబెల్ బహుమతి గ్రహీతల ఫొటోలు ఉన్న గదిలో కమిటీ కూర్చుంటుంది. ఆ గదిలో ధైర్యం, సమగ్రత నిండి ఉంటాయి. చేసిన కృషి, ఆల్ఫ్రెడ్ నోబెల్ అభీష్టంపైనే మా నిర్ణయం ఆధారపడి ఉంటుంది. ఇందులో ఇతర అంశాలు ఏవీ ప్రభావం చూపబోవు' అని స్పష్టం చేశారు.



# చైనాపై అదనంగా 100 శాతం సుంకాలు!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాల బాంబు పేల్చారు. చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ టారిఫ్‌లు నవంబరు 1 నుంచి అమల్లోకి రానున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే చైనాపై 30శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. వాణిజ్యంపై చైనా అసాధారంగా దూకుడుగా వ్యవహరిస్తోందంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. "చైనా తయారీ వస్తువులు ఏ దేశం నుంచి దిగుమతి అయినా.. చైనా ఏ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి చేసినా వాటికి ఈ సుంకాలు వర్తిస్తాయి" అని అమెరికా అధ్యక్షుడు తన పోస్ట్‌లో వెల్లడించారు. ఇది అన్ని దేశాలను ప్రభావితం చేస్తుందని, ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండబోదని తెలిపారు. నవంబరు 1 నుంచి లేదా ముందుగానే ఈ టారిఫ్‌లు అమల్లోకి రావచ్చన్నారు. చైనా తీసుకునే తదుపరి చర్యలను బట్టి దీనిపై యూఎస్ నిర్ణయం ఉంటుందన్నారు. అలాగే, క్రిటికల్ సాఫ్ట్‌వేర్‌ను ఇతర దేశాలతో పంచుకోవడంపై నియంత్రణ విధిస్తున్నట్లు వివరించారు. అమెరికా తయారుచేసే దాదాపు ప్రతి ఉత్పత్తి పైనా భారీగా ఎగుమతి ఆంక్షలు విధించాలని చైనా యోచిస్తోందనే నివేదికల ఆధారంగా తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమెరికాకు అరుదైన ఖనిజాలు ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై ఆగ్రహం



వ్యక్తంచేసిన ట్రంప్.. భారీ సుంకాలు విధిస్తానంటూ హెచ్చరికలు చేశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీని రద్దు చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగారు. ఇది జరిగిన కొన్ని గంటలకే ట్రంప్ సుంకాల ప్రకటన చేయడం గమనార్హం. ఇక, గతంలోనూ అమెరికా- చైనాల మధ్య వాణిజ్యయుద్ధం నడిచిన సంగతి తెలిసిందే. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య జరిగిన వాణిజ్య వివాదం తగ్గించే లక్ష్యంగా ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. ఈ క్రమంలో ట్రేడ్ డీల్‌కు ఇరుదేశాలు అంగీకరించినప్పటికీ.. అది ఓ కొలిక్కి రాలేదు. ఈ క్రమంలో తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి.

## బీహార్‌లో 100 స్థానాల్లో పోటీకి ఎంఐఎం సిద్ధం..!


బీహార్లో అసెంబ్లీ ఎన్నికల జోరు ఊపందుకుంది. దాంతో పార్టీల మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఈ క్రమంలో అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. బీహార్ ఎన్నికల్లో ఏకంగా 100 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రతిపక్ష మహాఘట్బంధన్‌లో చేరడం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఒంటరిగా తమ బలాన్ని నిరూపించుకోవాలని ఎంఐఎ నిర్ణయించింది. ఈ పరిణామం బీహార్ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఐదురెట్లు ఎక్కువ స్థానాల్లో పోటీకి దిగుతున్నామని ఎంఐఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ చెప్పారు. రాష్ట్రంలో ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ కూటములకు ప్రత్యామ్నాయంగా మూడో రాజకీయ శక్తిగా ఎదగడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మా సత్తాను ప్రత్యర్థులకు చూపిస్తామని, మా బలాన్ని తక్కువ అంచనా వేయలేరు" అని ఆయన అన్నారు.పొత్తు కోసం తాను ఆర్జేడీ అధినేతలు లాలూప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్‌లకు లేఖ రాసినా వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని అఖ్తరుల్ ఇమాన్ తెలిపారు. దాంతో 100 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించామని అన్నారు. కొన్ని భావసారూప్యత కలిగిన పార్టీలతో మూడో ఫ్రంట్ ఏర్పాటు విషయమై చర్చిస్తున్నామని, మరికొన్ని రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు. కాగా 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం ఏకంగా ఐదు స్థానాల్లో గెలిచింది. ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు ఆర్జేడీలో చేరడంతో ప్రస్తుతం అఖ్తరుల్ ఇమాన్ మాత్రమే పార్టీ ఏకైక శాసనసభ్యుడిగా ఉన్నారు. బీహార్‌లో 17 శాతానికి పైగా ఉన్న ముస్లిం జనాభానే లక్ష్యంగా చేసుకుని ఎంఐఎం తమ వ్యూహాలకు పదునుపెడుతోంది. ఇటీవల పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కూడా సీమాంచల్ ప్రాంతంలో పర్యటించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఆయా స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎంఐఎం పోటీతో సెక్యులర్ ఓట్లు చీలి బీజేపీకి లాభం చేకూరుతుందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాగా తమ పార్టీ ఏ కూటమికి 'బీ–టీమ్' కాదని ఎంఐఎం నేతలు స్పష్టం చేస్తున్నారు.

## అరట్టై వాడండి..



నేటికాలంలో వాట్సప్ గురించి తెలియని వారంటూ ఉండరు. ప్రతి ఒక్కరి సెల్ ఫోన్ లో ఈ ఫీచర్ తప్పనిసరి గా ఉంటుంది. ఇక కొందరు అయితే తెల్లవారింది మొదలు పడుకునే వరకు వాట్సాప్ చాట్ లో మునిగి తేలుతుంటారు. అయితే ఇటీవల విదేశీ వస్తువులను, ఫీచర్లను వాడవద్దు అనే నినాదం పెరిగింది. ఈ క్రమంలోనే వాట్సప్‌కు పోటీగా స్వదేశీ మెసేజింగ్ యాప్ 'అరట్టై' వచ్చింది. ప్రస్తుతం దీని పేరు నెట్టింట మార్మోగుతోంది. తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులోనూ అరట్టై గురించి ప్రస్తావన వచ్చింది. మరి..ఏ సందర్భంలో వచ్చింది, ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.. వాట్సప్ అకౌంట్ పునరుద్ధరణకు సంబంధించి సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. దానిపై శనివారం సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వాట్సప్ లేకపోతే ఏం.. అరట్టై వాడొచ్చు కదా అని సూచించింది. తన ఖాతాను వాట్సప్ బ్లాక్ చేసిందని, దాన్ని పునరుద్ధరించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఓ వ్యక్తి రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. సోషల్ మీడియాలో ఉన్నట్టుండి ఇలా అకౌంట్లను నిషేధించకుండా ఉండేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని కోరాడు. దీనిపై న్యాయస్థానం కూడా ఒకింత అసహనం వ్యక్తంచేసింది. వాట్సప్ యాక్సెస్ ఉండటం ప్రాథమిక హక్కు ఎలా అవుతుంది? అని ప్రశ్నించింది. పిటిషనర్ ఓ డయాగ్నిక్ సెంటర్‌లో పనిచేస్తున్నాడని, వాట్సప్‌లోనే తన క్లయింట్‌లతో టచ్‌లో ఉన్నారని, ఉన్నట్టుండి ఆ ఖాతాను బ్లాక్ చేశారని పిటిషనర్ తరపు న్యాయవాది బదులిచ్చాడు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కమ్యూనికేషన్ కోసం ఇతర యాప్‌లు కూడా ఉన్నాయని, వాటిని ఉపయోగించొచ్చు కదా..! అని ప్రశ్నించింది. ఈ మధ్యే స్వదేశీ యాప్ 'అరట్టై' కూడా వచ్చింది. దాన్ని వాడుకోండని సూచించింది. దీనిపై ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను కొట్టేసింది. సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలకు కంగుతిన్న పిటిషనర్.. కోర్టు అనుమతితో తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నాడు.ဝ

## 'నేనెప్పుడూ అలా అనలేదు'



**బెంగళూరు:** కర్ణాటకలో ముఖ్య మంత్రి మార్పు అంశం మళ్లీ తెర మీదకు వచ్చింది. ఈ ఏడాది చివరి నాటికి ఆ మార్పు తథ్యమంటూ అక్కడి మీడియా చానెల్స్ వరుసబెట్టి కథనాలు ఇస్తున్నాయి. ఈ క్రమంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేరిట కొన్ని కథనాలు వెలువడుతున్నాయి. దీంతో కన్నడ మీడియాపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను ముఖ్యమంత్రిని అయ్యే సమయం దగ్గరపడుతోంది అని నేను ఎక్కడా అనలేదు. కొంత మంది నేను సీఎం కావాలి అంటూ నినాదాలు చేస్తూ హడావిడి చేస్తున్నారు. కానీ, నా తలరాత ఏంటో నాకు తెలుసు. నాకేం తొందరలేదు అని వ్యాఖ్యానించారాయన. ఈ క్రమంలో.. కొన్ని మీడియా సంస్థలు తన వ్యాఖ్యలను వక్రీకరించి ప్రసారం చేస్తున్నాయని, అలా అసత్య ప్రచారాలు చేస్తే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. తానేం సీఎం పదవికి ఆశపడడం లేదని మరోసారి స్పష్టం చేసిన డీకే.. తాను రాజకీయాల కోసం కాదని, ప్రజల సేవ కోసం పని చేస్తున్నానని అన్నారు. ఈ నేపథ్యంలో.. ఈ అంశంపై మరోసారి తనను సంప్రదిస్తే మీడియాకు సహకరించబోనని స్పష్టం చేశారు. బెంగళూరులో లాల్‌బాగ్ వద్ద శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పై వ్యాఖ్యలు చేశారు.

## బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు బెదిరింపులు..
## దీదీపై 'ఈసీ' సీరియస్!




అవినీతి ఆరోపణల పేరిట.. పశ్చిమ బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్ అగర్వాల్‌ను సీఎం మమతా బెనర్జీ బెదిరించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో కావాలని 'ఈసీ' అడిగినట్లు జాతీయ మీడియాలో కథనం వచ్చింది. బెంగాల్ సీఈవో మనోజ్ అగర్వాల్ తన హద్దులను దాటితే ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణలను బయటపెడతానని మమతా బెనర్జీ ఇటీవల ఓ సమావేశంలో వ్యాఖ్యానించినట్లు సమాచారం. అదేవిధంగా రాష్ట్ర అధికారులను కూడా ఆయన బెదిరిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఆరోపించారు. 2011లో సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి.. ఓ సీఈవోపై దీదీ ఈ స్థాయిలో ఆరోపణలు చేయడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యల క్లిప్పింగ్, దాని అనువాద ప్రతిని అందజేయాలని సీఈవో కార్యాలయానికి ఈసీ సూచనలు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం వచ్చింది. మమతా వ్యాఖ్యలను ఖండిస్తూ అంతకుముందు ప్రతిపక్ష నేత సువేందు అధికారి నేతృత్వంలో భాజపా ఎమ్మెల్యేలు ఎన్నికల సంఘానికి ఓ లేఖ సమర్పించారు. సీఈవోను బెదిరించినందుకు సీఎంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు.

# వరంగల్, నల్గొండలో ఇంక్యూబేషన్ కేంద్రాలు

-మొదటిపేజీ తరువాయి

గ్లోబల్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ హబ్ గా మాత్రమే కాకుండా 'ఫార్మసీ ఆఫ్ పర్పస్'గానూ మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. రీసెర్చ్ ను మార్కెట్‌కు, పాలసీని రోగికి అనుసంధానించే సమగ్రమైన 360 డిగ్రీల ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 18 నెలల్లోనే లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా రూ.54వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు.

ఎలీ లిల్లీ లాంటి అంతర్జాతీయ ఫార్మా దిగ్గజ కంపెనీలను తెలంగాణకు తీసుకొచ్చి, ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. డాక్టర్ల కంటే వేగంగా రోగాలను నిర్ధారించినా, అనుభూతి చెందే మనసును మాత్రం ఏ యంత్రం భర్తీ చేయలేదన్నారు. దేశంలో తమ అనుభవాన్ని 'నాలెడ్జ్ ఇన్వెస్ట్ మెంట్'గా పెట్టేందుకు ముందుకు రావాలని ప్రవాసీ భారతీయ నిపుణులకు విజ్ఞప్తి చేశారు. పేటెంట్లను కాకుండా మీ ఆవిష్కరణ వల్ల ఎంత మందికి మేలు జరిగిందన్నదే చరిత్ర గుర్తుంచుకుంటుందని యువ ఇన్నోవేటర్స్ కు దిశా నిర్దేశం చేశారు.

మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అల్యూమ్ని గోల్డెన్ జూబ్లీ వేడుకలకు హాజరుకావడం ఎంతో సంతోషంగా ఉన్నది. నాతో పాటు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐటీ, ఇండస్ట్రీస్ డైనమిక్ మినిస్టర్ శ్రీధర్ బాబుచ కేయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి, ఇతర అతిథులకు,యూనివర్సిటీ ఫ్యాకల్టీ, పూర్వ విద్యార్థులు, ముఖ్యంగా ఇక్కడికి విచ్చేసిన విద్యార్థులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు, నమస్కారం. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ గోల్డెన్ జూబ్లీ పురస్కరించుకుని నిర్వహకులు ఈ విశిష్ట సదస్సును నిర్వహించడం చాలా గొప్ప విషయం. ఈ వేడుకలు ఇంత ఘనంగా నిర్వహిస్తున్న ఐఐ ఫార్మా అల్యూమ్ని అసోసియేషన్ సభ్యులకు నా హృదయపూర్వక అభినందనలు. పూర్వ విద్యార్థులు అంతా తిరిగి ఒక వేదికను ఏర్పరచుకుని సమాజానికి వారిందిస్తున్న సేవలు గుర్తు చేసుకోవడం,



భవిష్యత్ తరాలకు మార్గ నిర్దేశనం చేయడం..విలువలతో కూడిన విద్యకు నిదర్శనంగా చెప్పుకోవచ్చని అన్నారు.

ముఖ్యంగా ఫార్మసీ వృత్తి అనేది సమాజం పట్ల హ్యూమానిటీకి,పరిశోధన, నూతన ఆవిష్కరణలకు మధ్య వారధిగా పనిచేస్తుంది. "డాక్టర్ ట్రీట్ మెంట్ చేస్తారు...ట్రీట్ మెంట్ లో ఇచ్చే మెడిసిన్ పేషంట్ ను క్యూర్ చేస్తుంది. ఆ మెడిసిన్ ఎలా పనిచేస్తుంది,దేనికి పనిచేస్తుంది,ఎంత మోతాదు అనే పరిశోధన చేసేది మీరే కదా..ప్రజల ఆరోగ్యం, భద్రత కోసం మీరు అందించే సేవలు వెలకట్టలేనివి. సమాజం కోసం మీ మేధస్సును ధారరపోస్తారు. నల్గొండ జిల్లా సంకిశాల ప్రాంతానికి చెందిన పైళ్ల మల్లారెడ్డి 35 ఏళ్లుగా ఫార్మా రంగంలో ఉన్నారు. ఆయన న్యూ యార్క్ లో బ్యాక్టోలాక్ ఫార్మాస్యూటికల్,పలు కంపెనీలకు చైర్మన్ గా ఉన్నారు. ఆయన మార్కెట్ నెట్ వర్త్ సుమారు 10వేల కోట్లు. గ్రామీణ ప్రాంతానికి చెందిన పైళ్ల మల్లారెడ్డి లాంటి వారిని నేటి ఫార్మా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి. విద్య అనేది మనలో వెలుగు నింపుతుంది, తరతరాలకు ప్రేరణ ఇస్తుంది. అందుకే మా నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో కొత్తగా బి ఫార్మసీ, ఎం ఫార్మసీ కోర్సులు ఏర్పాటుకు కృషి చేశాను నల్గొండ ప్రాంతంలో దివీస్ లాంటి ప్రముఖ ఫార్మా కంపెనీలు ఉన్నాయి. ఇట్లాంటి సంస్థలు తెలంగాణ నే కాదు యావత్ భారతదేశాన్ని అభివృద్ధిలో, నూతన ఆవిష్కరణలో, సమాజ సేవ మార్గంలో నంబర్ వన్ గా నిలిపే మూల స్తంభాలుగా ఉంటాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. గత అయిదు దశాబ్దాలుగా యూసిపిఎస్సి ఔషధ విద్య, పరిశోధన మరియు సామాజిక సేవల్లో అగ్రగామిగా నిలిచింది. విద్యార్థుల్లో మేధస్సుతో పాటు నైతిక విలువలను పెంపొందించడం ద్వారా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అకాడమిక్, ఇండస్ట్రీ, నియంత్రణ సంస్థలలో నాయకులుగా ఎదిగేలా చేసింది.ఇక్కడి పూర్వ విద్యార్థులు పరిశ్రమలలో, పరిశోధనలో, నియంత్రణ సంస్థలలో చేసిన కృషి ఈ సంస్థ యొక్క దూరదృష్టి మరియు సమగ్ర విద్యను ప్రతిబింబిస్తుందని అన్నారు.

విద్యార్థుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం అల్యూమ్ని అందిస్తున్న సహకారం వారికి ఉన్న దాతృత్వ మనసుకు నిదర్శనం. ఈ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ గత విజయాల జ్ఞాపకాన్ని మాత్రమే కాకుండా, భవిష్యత్ ఆవిష్కరణలకు,సహకారానికి ప్రేరణగా నిలవాలని కోరుకుంటున్నాను. ఫార్మా రంగం అభివృద్ధి కోసం మా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఇండస్ట్రీస్ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో అనేక చర్యలు చేపడుతుంది. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఓఆర్ఆర్ నిర్మించాం.. శంషాబాద్ ఎయిర్పోర్ట్ నిర్మించాం.అది అనేక పరిశ్రమలు వచ్చేందుకు కీలక భూమిక పోషించిందని అన్నారు. ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించబోతున్నాం..ఓఆర్ఆర్ నుండి ఆర్ఆర్ఆర్ కు రేడియల్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇది పారిశ్రామిక వృద్ధికి దోహద పడుతుంది. తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు మా క్యాబినెట్ అంతా కలసి అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. ఐటీ,ఫార్మా హబ్ గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ఇక్కడికి వచ్చిన ఫార్మా ప్రముఖులు, ప్రొఫెసర్స్ అందరూ మరిన్ని నూతన ఆవిష్కరణలు చేయాలని,భగవంతుడు వారికి మరింత శక్తిని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి, విద్య, పరిశోధనల ద్వారా రాష్ట్రం మరియు దేశానికి మరింత సేవ చేయాలని ఆశిస్తున్నానని అన్నారు.

# కొత్త రకం మోసం..
# రికార్డుల్లో కుబేరులు

**హైదరాబాద్ :** మోసపోతున్న వారు ఉంటే.. మోసం చేసే వారి సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. ఇటీవల సైబర్ నేరగాళ్లు ఎలాగైనా ఇతరుల సొమ్ము కాజేయాలనే ఉద్దేశంతో వివిధ రకాల పన్నాగాలు వేస్తున్నారు. అందులో కొన్ని విజయవంతం అవుతాయి.. మరికొన్ని ఫెయిల్ అవుతాయి. అయితే ఇక్కడ వీటికి విభిన్నంగా డబ్బులను దోచుకునే ప్లాన్ వేశారు. ఎవరికీ అనుమానం రాకుండా.. కేంద్ర ప్రభుత్వాన్నే మోసం చేసే రేంజ్ కు వెళ్లిపోయారు. ఇంతకు ఏం జరిగింది..? వాళ్లు చేస్తున్న పని ఏంటి..?హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో కొత్త రకం మోసం వెలుగు చూస్తోంది. ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు, అడ్డా కూలీలు వంటి సామాన్య ప్రజలను కొందరు కేటుగాళ్లు తమ అక్రమ లావాదేవీలకు వాడుకుంటున్నారు. వీరికి తెలియకుండానే.. ఈ అమాయక ప్రజలు ఒక్కసారిగా రికార్డుల్లోకి కుబేరులుగా మారిపోతున్నారు. వీరి పేర్ల మీద బోగస్ కంపెనీలు సృష్టించి.. కోట్ల రూపాయల టర్నోవర్ జరిగినట్టు లెక్కలు చూపిస్తున్నారు. అసలు విషయం ఏమిటంటే.. ఈ మోసగాళ్లు పన్నులు ఎగ్గొట్టడానికి, జీఎస్టీ నుంచి ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ సబ్సిడీని అక్రమంగా పొందడానికి ఈ సామాన్యులను పావులుగా ఉపయోగిస్తున్నారు.ఈ మోసాలు ఎలా జరుగుతున్నాయంటే.. మోసగాళ్లు ముందుగా సామాన్యుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు. వ్యక్తిగత లోన్, హౌస్ లోన్లు బ్యాంక్ నుంచి ఇప్పిస్తామని.. స్వచ్ఛంద సంస్థల నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామని నమ్మబలుకుతారు. దీని కోసం ఆ ఆటో డ్రైవర్లు, టీ కొట్టు నిర్వాహకులు, అడ్డా కూలీలు.. తమ ఆధార్, పాన్ కార్డు, ఓటర్ ఐడీల జిరాక్స్ కాపీలను ఇస్తారు.కీలకమైన విషయం ఏమిటంటే.. కేవలం ఆధార్ కార్డు ఆధారంగానే జీఎస్టీ టిన్ నంబర్‌ను పొందే వెసులుబాటును ఈ కేటుగాళ్లు తమ నేరాలకు తెలివిగా వాడుకుంటున్నారు. ఆ పత్రాలను ఉపయోగించి బోగస్ సంస్థల పేరిట జీఎస్టీ రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. ఆ టిన్ నంబర్ల ద్వారా అసలు జరగని వ్యాపార లావాదేవీలు



జరిగినట్లు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి, వాటిని అడ్డుపెట్టుకుని కోట్ల రూపాయల ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ సబ్సిడీని దొంగిలిస్తున్నారు.ఈ మోసపోయిన అమాయకులకు తాము చేసిన వ్యాపారం గురించి గానీ.. కోట్ల టర్నోవర్ గురించి గానీ అసలు తెలియదు. ఎప్పుడైతే జీఎస్టీ అధికారులు ఇంటికొచ్చి.. వారి పేరిట వందల కోట్ల లావాదేవీలు జరిగాయని నోటీసులు ఇస్తారో.. అప్పుడే వారు ఉలిక్కిపడి తాము మోసపోయినట్లు తెలుసుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో రుణం కోసం ప్రయత్నించిన ఒక ఆటో డ్రైవర్‌కు ఇలాగే రూ. 100 కోట్ల టర్నోవర్‌పై జీఎస్టీ నోటీస్ వచ్చింది. దీంతో తినడానికే సరిగ్గా తిండి లేక.. ఉండటానికి ఇళ్లు లేని తమ జీవితం దుర్భరంగా ఉంటే.. ఇంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుందని వారు బాధపడి, ఆ నోటీసులకు ఏం సమాధానం చెప్పాలో తెలియక పోలీసులు, లాయర్ల చుట్టూ తిరుగుతున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఈ ఏడాది 12 నుంచి 15 వరకు ఇలాంటి కేసులు నమోదయ్యాయి. ఇందులో కొన్ని ట్రేడింగ్ కంపెనీలు ఏపీ, మహారాష్ట్రల వ్యాపారులకు ముడి ఇనుము సరఫరా చేసినట్లు లెక్కలు చూపించి.. నకిలీ బిల్లులతో ఏకంగా రూ. 33 కోట్ల ఎఆ పొందారు. అందుకే పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మీరు ఈ మోసగాళ్ల బారిన పడకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అందులో.. మీ ఆధార్, పాన్ వంటి ముఖ్యమైన పత్రాలను ఎవరికీ ఇవ్వకూడదు. రుణం తీసుకోవాలంటే నేరుగా బ్యాంకులను మాత్రమే సంప్రదించండి.ఏదైనా కంపెనీలో ఉద్యోగానికి లేదా మరేదైనా అవసరానికి మీ ఐడీ పత్రాలు అడిగితే.. ఆ సంస్థకు సరైన చిరునామా, ఫిజికల్ ఆఫీస్ ఉన్నాయా లేదా అని పరిశీలించండి. ఆన్‌లైన్‌లో కంపెనీ వివరాలు కనిపించకపోతే అది బోగస్ అయ్యే అవకాశం ఉంది. జీతం ఇవ్వడానికి ముందు డబ్బు కట్టమని అడగడం, లేదా అధిక ధర కలిగిన వస్తువులు కొని తిరిగి పంపమని అడగడం వంటివి జరిగితే అది మోసమే అని గుర్తించండి.

# కమలం కామ్...

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ వచ్చింది. ఈ నెల 13న నోటిఫికేషన్ వెలువడుతుంది. కానీ? బీజేపీ ఇంకా తన అభ్యర్థిని ప్రకటించలేదు. అసలా విషయంలో ఒక క్లారిటీ ఉందో లేదో కూడా బయటికి తెలియడం లేదు. అభ్యర్థి ఎంపిక కోసం ముగ్గురు నాయకులతో కమిటీ వేసి అభిప్రాయ సేకరణ కూడా చేసింది పార్టీ రాష్ట్ర నాయకత్వం. ఈ క్రమంలో? త్వరలోనే ముగ్గురు పేర్లతో రాష్ట్ర ఎన్నికల కమిటీ కేంద్ర పార్టీకి లిస్ట్ పంపబోతోందట. మరోవైపు ఈసారిపార్టీ టిక్కెట్ ఆశిస్తున్న వాళ్ళ లిస్ట్ చాంతాడంత ఉంది. ఇక్కడ విశేషం ఏంటంటే.. జూబ్లీహిల్స్ కమలం టిక్కెట్ ఆశిస్తున్న వారిలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఉన్నారు. వాళ్ళలో కొందరైతే గట్టిగానే ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు సమాచారం. ప్రస్తుతం రేస్‌లో అరడజన్‌కు పైగా మహిళా నేతల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. గత ఎన్నికల్లో టికెట్ ఆశించిన జూటూరు కీర్తి రెడ్డి ఈసారి నాకో ఛాన్స్ అంటున్నారట. అందుకు తగ్గట్టే? ఆమె నియోజకవర్గంలో ఎప్పటి నుంచో తిరుగుతున్నారు కూడా. బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ వీరపనేని పద్మ కూడా సీటు ట్రయల్స్‌లో ఉన్నారు. తనకు సామాజికవర్గం కలిసి వస్తుందని నమ్మకంగా ఉన్నారట ఆమె.ఇక మరో మహిళా నేత ఆకుల విజయ కూడా టికెట్ కోసం గట్టి ప్రయత్నాలే చేసుకుంటున్నట్టు సమాచారం. పార్టీకి చెందిన కొందరు పెద్ద నేతలతో కూడా రికమండ్



చేయించుకుంటున్నారట ఆమె. ఆ నేతలు అభిప్రాయ సేకరణ కమిటీ ముందు తమ మనసులో మాట చెప్పేసినట్టు తెలుస్తోంది. ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి పోటీచేసి ఓడిపోయిన మాధవీలత కూడా టికెట్ రేస్‌లోకి వచ్చేశారట. ఆమె తనకున్న పరిచయాలతో ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్టు చెప్పుకుంటున్నాయి పార్టీ శ్రేణులు. రీసెంట్‌గా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును కలిశారు జయసుధ. దీంతో ఆమె పేరు కూడా జూబ్లీ హిల్స్ అభ్యర్థిగా తెరపైకి వచ్చింది.ఇక బండారు దత్తాత్రేయ కూతురు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బండారు విజయ లక్ష్మి పేరు కూడా వినిపిస్తోంది. విజయలక్ష్మి పేరు గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ వినిపించింది? సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏదో ఒక సీట్ నుండి ఆమె పోటీ చేయవచ్చన్న ప్రచారం జరిగినా? సాధ్యపడలేదు. ఇక గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ , బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక రెడ్డి కూడా పార్టీ అడిగితే? పోటీకి సిద్ధమని అంటున్నారట. ఈ రకంగా జూబ్లీహిల్స్ కోసం తెలంగాణ బీజేపీలో మహిళా నేతలు మేమంటే మేమంటూ పోటీలు పడుతున్నారు. ఎవరికంటే ఏం తక్కువ కాదంటూ? సీరియస్ ట్రల్స్‌లో ఉన్నారట. దీంతో పార్టీ అధిష్టానం ఎవరివైపు మొగ్గుకతుందన్న ఉత్కంఠ పెరుగుతోంది.

## ఐకానిక్ బిల్డింగ్‌గా టీ స్క్వేర్

-మొదటిపేజీ తరువాయి

టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, ఐటీ శాఖ డిప్యూటి సెక్రటరీ భవేష్ మిశ్రా , ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ మేరకు సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'టీ స్క్వేర్ నిర్మాణం లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.. పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి.. టీ స్క్వేర్ లో ఆపిల్ లాంటి ఇంటర్నేషనల్ బ్రాండ్స్ తమ ఔట్లెట్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. యుటిలిటీ జోన్ ఏర్పాటు చేయాలి. టీ స్క్వేర్ 24 గంటల పాటు పని చేయాలి. ఏఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో భవనాలను పరిశీలించాలి. ఏఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలి. ఏఐ హబ్‌లో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు చేయాలిలిఅని సూచించారు.

## బనకచర్ల డీపీఆర్ అప్రైజల్‌పై
## సీఎం ఎందుకు స్పందించడం లేదు..?

-మొదటిపేజీ తరువాయి





స్పందించలేదు. మన దేశంలో సెంట్రల్ వాటర్ కమిషన్ నిబంధనలు, రాజ్యాంగం పరంగా వరద జలాల మీద డీపీఆర్ అప్రైజల్ జరగదు. కానీ ఏపీ ప్రభుత్వం ఈ వరద జలాల మీద బనకచర్ల డీపీఆర్ అప్రైజల్ సబ్మిట్ చేసింది.. దీనిపై కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి లేఖ రాశారు. మరి రేవంత్ రెడ్డి వరద జలాల మీద డీపీఆర్ అప్రైజల్ సాధ్యం కాదని నిలదీయాలి.. కానీ దీనిపై ఇప్పటి వరకు స్పందించలేదు అని హరీష్ రావు నిలదీశారు. 463 టీఎంసీలు నీళ్లు గోదావరి నుండి కృష్ణా నదికి ఆంధ్రప్రదేశ్ మళ్లిస్తుంది.. మేము ఆల్మట్టిలో 112 టీఎంసీలు ఆపుకుంటామని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. మీరు అనుమతిస్తే మేము కృష్ణా నది నీళ్లు ఆపుకుంటానని చెప్తున్నాడు.. దీని వల్ల తెలంగాణ నష్టపోతుంది. కింద గోదావరి నీళ్లు ఏపీ తీసుకుపోతే.. పైన కృష్ణా నీళ్లు కర్ణాటక తీసుకుపోతే, మన బ్రతుకు ఏం కావాలి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఏపీ 463 టీఎంసీల నీళ్లు మళ్లిస్తే నేను మీద 112 టీఎంసీలు ఆపుకుంటా అని కర్ణాటక అంటుంది.. నేను 74 టీఎంసీలు ఆపుకుంటా అని మహారాష్ట్ర అంటుంది. 112 టీఎంసీలు కర్ణాటక, 74 టీఎంసీలు మహారాష్ట్ర ఆపితే మన పరిస్థితి ఏంది. మాట్లాడితే నల్లమల బిడ్డ అంటాడు.. ఆ నల్లమలను అనుకొని పారే కృష్ణా నదిలో ఆ మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరిగితే ఎందుకు మాట్లాడటం లేదు. నువ్వు నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా.. ఎందుకు మాట్లాడటం లేదు. పులి అయితే మాట్లాడేవాడివి.. పిల్లివి, ఎలుకవు కాబట్టి మాట్లాడటం లేదు అని హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పోలవరంని జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించినప్పుడు కుడి కాలువ కెపాసిటీ 11,500 క్యూసెక్కులు. ఇప్పుడు కుడి కాలువ కెపాసిటీని 23,000 క్యూసెక్కులు అని అంతకంత పెంచారు. జాతీయ ప్రాజెక్ట్ అని హోదా ఇచ్చాక కెపాసిటీని పెంచి కాలువ తవ్వుతుంటే బీజేపీ పార్టీ ఎలా అనుమతినిచ్చింది. గతంలో కుడి కాలువ కెపాసిటీని 11,500 నుండి 18,000 పెంచినప్పుడు కేసీఆర్ ప్రభుత్వం ప్రశ్నిస్తే పనులు ఆగిపోయాయి. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కెపాసిటీ 23,000కు పెరిగినా ఎవరు అడ్డుకోలేదు, బిల్లులు రిలీజ్ అయ్యాయని హరీశ్‌రావు తెలిపారు.

## ఎలా ముందుకెళ్దాం.. ఏం చేద్దాం!

-మొదటిపేజీ తరువాయి

స్థానిక ఎన్నికలకు అడ్డంకులేవీ లేవని హైకోర్టు తెలిపింది. ఓపెన్ కేటగిరీలో స్థానిక ఎన్నికలు జరుపుకోవచ్చని చెప్పింది. ఎన్నికల ప్రక్రియలో తాము జోక్యం చేసుకోవడం లేదన్న న్యాయస్థానం.. రిజర్వేషన్ల50శాతం పరిమితిని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది. ఈ క్రమంలోజీవోలు 9, 41, 42 అమలు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా పాత విధానంలో ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీలకు 25శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి.

## సమస్య ఎవరికి చెప్పుకోవాలో..?
## ఇంతకీ గ్రామాలను పట్టించుకునేవారెవరు..?




గ్రామాలు బాగుండాలంటే ప్రజల సమస్యలను వినేందుకు, వాటిని తీర్చేందుకు గ్రామపంచాయతీ పాలక వర్గం ఉండాలి. ఇంతకీ పాలకవర్గమే లేకుంటే మరి తమ గోడు వెళ్లబోసుకునేది ఎవరికి..? ఇదీ ప్రస్తుతం తెలంగాణలోని గ్రామాల్లో నెలకొన్న పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నెలలు గడుస్తున్నా స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా.. ? తమ ఊళ్లకు కొత్త పాలకవర్గం ఎప్పుడొస్తుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కుటుంబానికి పెద్ద దిక్కు లేని మాదిరిగా సర్పంచులు లేక గ్రామపంచాయతీలు బిక్కు బిక్కుమంటున్నాయి. గ్రామాలలో గొడవలు జరిగితే న్యాయం కోసం ఎవరి వద్దకు వెళ్లాలో తెలియక ప్రజలు అల్లల్లాడిపోతున్నారు. ఇక గ్రామాలలో అభివృద్ధి పనులు జరగక, చెత్త ఎత్తే నాథుడే లేక గ్రామాలు కన్నీరు పెడుతున్నాయి. ఈ పాపం ఎవరిది ఎవరి స్వార్థాల కోసం గ్రామాలను దివాళా తీస్తున్నారు. గత పాలనలో గ్రామానికి సర్పంచులు, వార్డు మెంబర్లు ఉంటూ గ్రామాలను కంటికి రెప్పలా చూసుకున్నారు. కానీ నేడు గ్రామాలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. గ్రామాలలో నీటి సమస్య, పారిశుధ్య సమస్య రాజ్యమేలుతున్నా ఎవరిని అడగాలో, ఎవరికి చెప్పుకోవాలో తెలియక గ్రామస్తులు బాధను దిగమింగుకుంటున్నారు.

**కల తప్పిన పండుగలు, ఉత్సవాలు..**

గ్రామాల్లో సర్పంచులు లేక కేంద్రం నుండి వచ్చే నిధులు ఆగిపోవడంతో గ్రామాలలో అభివృద్ధి కుంటుపడింది. గ్రామాలలో పండుగలు, ఉత్సవాలు జరపాల్సి వచ్చినప్పుడు గ్రామ సర్పంచ్ గ్రామానికి పెద్దగా ముందు నిలబడి అన్ని తానేనంటూ ప్రజలకు సూచనలు చేస్తూ కార్యక్రమాలను దిగ్విజయం చేసేవాడు. కానీ ప్రస్తుతం సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు లేక గ్రామాలలోని పండుగలు, ఉత్సవాలు కల తప్పాయి. నోటిఫికేషన్ పడింది కదా ఇక గ్రామాలకు సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు వస్తారులే అని మురిసిన గ్రామస్తులకు రిజర్వేషన్ అనే పిడుగు పడింది. కోర్టు తీర్పుతో ఎన్నికలు వాయిదా పడగా, దిక్కుతోచని స్థితిలోకి గ్రామాలు వెళ్లాయి. కాంగ్రెస్ ప్రభుత్వ అవగాహన రాహిత్య నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఆగిపోయాయని రాజకీయవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఎన్నికలు జరుపుతారా..? లేక గ్రామాలకు సర్పంచులు లేక చరిత్రలో నిలిచిపోతారా..? అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## సంపాదకీయం

# మత్తులో యువత చిత్తు

విచక్షణ జ్ఞానం గల మనిషిని మాదకద్రవ్యాలు మృగంగా మార్చేస్తూ, ప్రజా ఆరోగ్యానికి, శాంతి భద్రతలకు ప్రథమ శత్రువులుగా పరిణమించాయి. గంజాయి, హెరాయిన్, కొకైన్, మెఫీడ్రిన్ వంటి పదార్థాలు నిత్యం ఏదో ఓ చోట పట్టుబడుతూనే ఉన్నాయి. అదే సమయంలో ఎన్నో రెట్లు ఎక్కువ పరిమాణంలో మత్తు పదార్థాలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరి వినియోగ దారుల చెంతకు చేరుతున్నాయి. విదేశాల నుంచి భారత్‌లోకి చొరబాట్ల ద్వారా ప్రవేశిస్తున్న ఈమత్తు పదార్థాలకు తోడు, స్థానిక పరిశ్రమల్లో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న డ్రగ్ తయారీ దందాలు దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారాయి. ఇటీవల హైదరాబాద్‌లోని చర్లపల్లి ప్రాంతంలో పోలీసుల దాడిలో కోట్ల రూపాయల విలువైన మెఫీడ్రిన్ మత్తుమందు, ముడిసరుకులు స్వాధీనం కావడం ఈ వ్యవస్థీకృత నేరాల విస్తృతిని సూచిస్తోంది. గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా ఇలాగే రూ.230 కోట్ల విలువైన డ్రగ్స్ ఉత్పత్తి సామగ్రి పట్టుబడింది.ఇవన్నీ ప్రాణాధార ఔషధాల ముసుగులో జరుగుతున్న నేర కార్యకలాపాలు. వీటిని సమూలంగా అరికట్టకపోతే దేశాన్ని అనారోగ్యం, అల్లకల్లోలం వైపు నెడతాయి. పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు, వృత్తి, సాంకేతిక విద్యాలయాల వరకు మత్తుమందుల ప్రభావం విస్తరిస్తోంది. యువతలో 'ఒత్తిడి' తగ్గించుకోవడం పేరుతో లేదా స్నేహితుల ప్రోత్సాహంతో డ్రగ్స్ వైపు అడుగులు వేస్తున్నారు. ఉన్నత విద్యావంతులు, డాక్టర్లు, ఇంజినీర్లు సైతం ఈ మాదక రక్కసి కబంధహస్తాల్లో చిక్కి విలవిల్లాడుతున్నారు. మత్తు అలవాటుతో మానసిక స్థైర్యం కోల్పోయి నేరాలకు పాల్పడడం, ఆత్మహత్యలు చేసుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. డ్రగ్స్ ట్రీట్మెంట్ క్లినిక్‌లకు వెళ్లేవారి సంఖ్య ఐదేండ్లలో పదమూడు వందల శాతం పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. ఇండోర్, ముంబై, చెన్నై, లక్నో వంటి నగరాల్లో ఈ మహమ్మారి విస్తరిస్తూ ఉంది. మన రాష్ట్రంలోనే మత్తు మార్కెట్ విలువ దాదాపు రూ.వెయ్యి కోట్లకు పైగా ఉందని అధికారులు చెబుతున్నారు. పట్టుబడుతున్న మత్తుమందులు మొత్తం వ్యాపారంలో పది శాతానికి కూడా చేరవు. స్థానికంగా ఉత్పత్తి అవుతున్న గంజాయి, లాటిన్ అమెరికా నుంచి చేరే హెరాయిన్, అలాగే ఔషధ కర్మాగారాల రూపంలో తయారవుతున్న రసాయన డ్రగ్స్ మార్కెట్లో సులభంగా లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం నలభై నాలుగుకు పైగా రకాల మత్తు పదార్థాలు వినియోగంలో ఉన్నాయని అధికారుల అంచనా. ఇటీవల మహారాష్ట్ర పోలీసులు చర్లపల్లి పారిశ్రామికవాడలో రూ.పన్నెండు కోట్ల విలువైన మత్తు మందులు స్వాధీనం చేసుకోవడం, గత ఏడాది రూ.139 కోట్లు, ఈ ఏడాది జూలై వరకు రూ.68 కోట్ల విలువైన డ్రగ్స్ ఈగల్ అధికారులు పట్టుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. పట్టణాలు, నగరాల ప్రతి మూలలో గంజాయి మత్తులో తేలుతున్న యువతను చూడడం ఇప్పుడు సాధారణ దృశ్యమైంది. హైదరాబాద్‌లో ఖరీదైన హెరాయిన్, కొకైన్ డ్రగ్స్‌తో పార్టీలు నిర్వహించడం 'ఫ్యాషన్'గా మారింది. ముఠాలు మొదట ఉచితంగా సరఫరా చేసి, తరువాత ఆ వ్యక్తులను అమ్మకందారులుగా మార్చే వ్యూహం అవలంబిస్తున్నాయి. ప్రభుత్వం కట్టడి చర్యలు ఫలితాలనివ్వడం లేదు. అధికారుల కన్నుగప్పి వ్యాపారం విస్తరిస్తూనే ఉంది. 2023లో ఈగల్ అధికారులు 104.75 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకోగా, 2024లో అది 336.56గ్రాములుగా పెరిగింది. అలానే హెరాయిన్ విషయంలో కూడా ఇదే ధోరణి 2023లో 419 గ్రాములు, 2024లో 2,160.67 గ్రాములు పట్టుబడ్డాయి. నిన్నటికి నిన్న వ్యాసం రాస్తుండగానే హైదరాబాద్‌లో నిషేధిత ఎఫి డ్రీన్ మత్తు పదార్థాన్ని భారీగా తయారు చేసి విక్రయించేందుకు సిద్ధమైన ముఠాను తెలంగాణ ఈగల్ (ఎలిటీ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్ ఫోర్స్‌మెంట్) పట్టుకుంది. 220 కిలోల ఎఫీడ్రిన్ ను స్వాధీనం చేసుకుంది. దీని విలువ దాదాపు రూ. 72 కోట్ల విలువ అంతర్జాతీయ మార్కెట్లో ఉంటుందని తెలుస్తోంది. ఈ పరిస్థితులు,గణాంకాలు భయంకర దిశను చూపుతున్నాయి. ఇలా ఊడలు దిగిన డ్రగ్స్ విషవ్యాపారాన్ని నిర్మూలించాలంటే? కేంద్రం అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాలి. దీనికి సంబంధించిన ముడి సరుకులు ఎక్కడినుంచి వస్తున్నాయి, ఏ ప్రాంతాల్లో మత్తు మందులను ఎలా తరలిస్తున్నారు? అనే అంశాలపై లోతుగా ఆరా తీయాలి. ఆ రవాణా వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేయాలి. దేశవ్యాప్తంగా అన్ని పారిశ్రామిక ల్యాబ్‌ల కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. డ్రగ్స్ కేసులను పకడ్బందీగా దర్యాప్తు చేసేలా సిబ్బందికి తగిన శిక్షణ అందించాలి. దీని వెనుక అసలు సూత్రధారులను కటకటాల్లోకి నెట్టడం అత్యవసరం. వారికి వెంటనే కఠిన శిక్షలు పడాలంటే డ్రగ్స్ కేసుల విచారణ ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి. నిర్లక్ష్యం వహిస్తే భావితరం ఇంకా బలహీనమై జాతి భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతుంది. పాఠశాలలు, కళాశాలలు, సమాజ సంస్థలు డ్రగ్ అవగాహన కార్యక్రమాలను తరచుగా నిర్వహించి యువతను మేలుకొలపాలి. ప్రభుత్వం కఠిన చట్టాలతో పాటు పునరావాస కేంద్రాల ద్వారా మత్తుకు బానిసలైన వారికి సహాయం చేయాలి. ఇదే సమయంలో సమాజం కూడా నిర్లక్ష్యంగా ఉండకూడదు. ప్రతి పౌరుడు ఈ సమస్యపై బాధ్యతగా స్పందిస్తేనే రేపటి తరాన్ని రక్షించగలం.

# న్యాయ వేదికపై ఓ మానవతా విప్లవం



డాక్టర్ రామ్ మనోహర్ లోహియా 1910 మార్చి 23న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఫైజాబాద్ జిల్లా, అక్బర్‌పూర్ గ్రామంలో జన్మించారు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఆయన చిన్ననాటి నుంచే సమాజంలో ఉన్న అసమానతలు, పేద ప్రజల కష్టాలు, అన్యాయ పరిస్థితులు ఆయన మనసును కదిలించాయి. సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేయాలన్న సంకల్పం చిన్నతనంలోనే ఆయనలో బలపడింది. విద్యాభ్యాసంలో అసాధారణ ప్రతిభ కనబరచిన లోహియా, భారత రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపై లోతైన అవగాహన పెంపొందించుకున్నారు. జర్మనీలో ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పూర్తి చేసి, యూరోపియన్ సామాజిక సిద్ధాంతాలపై విశేష పట్టు సాధించారు. అక్కడి సామాజిక, ఆర్థిక చైతన్య ఉద్య మాల నుంచి ఆయనకు స్ఫూర్తి లభించి, దేశానికి ఒక ప్రగతిశీల నాయకుడిగా అవతరించడానికి దారితీసింది. లోహియా గారి రాజకీయ ప్రవేశం భారత స్వాతంత్ర్య ఉద్యమం ద్వారానే ఆరంభమైంది. 1930–40ల మధ్య గాంధీ సత్యాగ్రహాలు, నిరసనలు, జైలు పోరాటాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉద్యమకారుడిగా ఆయన చూపిన ధైర్యం, త్యాగం విశేషమైనవి. భారత యువతలో రాజకీయ చైతన్యాన్ని రగిలించడం, స్వాతంత్ర్యం కోసం వారిని ప్రేరేపించడం ఆయన ప్రధాన ధ్యేయంగా మారింది. విదేశాల్లో నేర్చుకున్న సామాజిక ఆర్థిక సిద్ధాంతాలను భారతీయ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసి, పేదలు, రైతులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో కృషి చేశారు. స్వాతంత్ర్యం అనంతరం లోహియా గారు భారత రాజకీయ రంగంలో సామాజిక సమానత్వం, ఆర్థిక న్యాయం, పేదల సంక్షేమం వంటి అంశాలను ముందుకు తెచ్చారు. నెహ్రూ ప్రభుత్వ విధానాలపై ఆయన గట్టి విమర్శలు చేశారు. ప్రజల సంక్షేమాన్ని కంటే ప్రభుత్వ వ్యవస్థల కేంద్రీకృత ఆలోచనలను ఆయన వ్యతిరేకించారు. సోషల్ ప్రోగ్రెసివ్ పార్టీ, తరువాత సోషలిస్ట్ పార్టీ స్థాపన ద్వారా రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాలు, యువత హక్కుల పరిరక్షణకు గట్టి కదలికలు చేపట్టారు. లోహియా గారి నాయకత్వం సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలకు కొత్త దిశను చూపింది. లోహియా గారి రాజకీయ తత్త్వాలు ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, యువత చైతన్యం, ఆర్థిక న్యాయం అనే నాలుగు మూలస్తంభాలపై నిలిచాయి. కుల, లింగ, ఆర్థిక భేదాలను నిర్మూలించి, సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించాలన్నది ఆయన ప్రధాన ధ్యేయం. ప్రజాస్వామ్యం కేవలం ఓటు హక్కులో కాకుండా, ప్రజల పాలనా హక్కులో ప్రతిబింబించాలన్నది ఆయన విశ్వాసం. ఆయన రైతు, కార్మికుల జీవితాలను లోతుగా అర్థం చేసుకుని, వారి సమస్యలకు తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ప్రజల్లో రాజకీయ అవగాహన, సామాజిక బాధ్యత కలగాలన్న ఆలోచనతో జీవించారు. లోహియా గారి రాజకీయ జీవనంలో అనేక విశిష్ట ఘట్టాలు చోటుచేసుకున్నాయి. 1942–44 మధ్య స్వాతంత్ర్య పోరాటంలో బాంబే, లక్నో, అహ్మదాబాద్ ప్రాంతాల్లో యువత, రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. 1948–49లో సోషల్ యూత్ ఆర్గనైజేషన్‌ను స్థాపించి, యువతలో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించారు. 1952–67 మధ్య లఖ్నో, బీహార్ ప్రాంతాల ప్రజాప్రతినిధిగా పార్లమెంట్‌లో పనిచేసి, పేదల, రైతుల, కార్మికుల హక్కుల రక్షణకు సంబంధించిన చట్టబి ల్లులు ప్రవేశపెట్టారు. నెహ్రూ పాలనలోని ఆర్థిక విధానాలపై ఆయన చేసిన విప్లవాత్మక విమర్శలు, ప్రత్యామ్నాయ ఆర్థిక సూత్రాల ప్రతిపాదనలు భారత రాజకీయ చరిత్రలో ప్రగతిశీల మైలురాళ్లుగా నిలిచాయి. లోహియా గారి ప్రసంగాలు, వ్యాసాలు, రచనలు భారతీయ రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై లోతైన విశ్లేషణను అందించాయి. 1950%–%67 మధ్య ఆయన రూపొందించిన సామాజిక న్యాయ బిల్లులు, రైతు సంక్షేమ చట్టాలు, కార్మిక హక్కుల పరిరక్షణ చట్టాలు భారత రాజకీయ చరిత్రలో స్థిరమైన పునాది వేశాయి. ఆయన ప్రజలలో చైతన్యాన్ని రగిలించి, సామాజిక సమానత్వం వైపు దారి చూపిన గొప్ప మార్గదర్శకుడు.

1967 అక్టోబర్ 12న 57 ఏళ్ల వయసులో లోహియా గారు పరమపదించారు. ఆయన మరణం భారత రాజకీయ రంగానికి అపూర్వ నష్టం. అయినా ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు, జీవన విలువలు భారత ప్రజాస్వామ్య చైతన్యంలో నేటికీ సజీవంగా ఉన్నాయి. సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువలు, యువతలో చైతన్యం పెంపొందించడానికి ఆయన చేసిన కృషి భారత చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచింది. డాక్టర్ రామ్ మనోహర్ లోహియా జీవితం మనకు ఒక గొప్ప పాఠం. సమాజంలో అసమానతలను తొలగించి, ప్రజాస్వామ్యాన్ని ప్రజల జీవితాల్లోకి తీసుకురావాలన్న ఆకాంక్ష ఆయన సూత్రాల సారం. ఆర్థిక, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన త్యాగం, పోరాటం భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తాయి. ఆయన ఆలోచనలు నేటి భారత రాజకీయాలకు మార్గదర్శకంగా ఉండి, సమాజాన్ని సమానత్వం, న్యాయం, చైతన్య దిశలో నడిపిస్తాయి. లోహియా గారి జీవితం ఒక ఆదర్శం ు సామాజిక న్యాయానికి ప్రతీక, ప్రజాస్వామ్య చైతన్యానికి శాశ్వత దీప్తి.

# కదలికకు కీళ్లే కీలకం

మన ప్రతి కదలికకూ కీలే.. కీలకం! జాయింట్లు మృదువుగా, సజావుగా, సున్నితంగా కదులు తుంటేనే... మన జీవితం హాయిగా, సుఖంగా సాగుతుంటుంది. అది వేళ్ల, మణికట్టు, భుజం, చివరికి పాదాల, వేళ్ల ఏ జాయింట్లు అయినా కావచ్చు.. మోకాలి కీళ్లు కావచ్చు. ఏ కదలికకైనా ఈ కీళ్లే కీలకం. మరి మన శరీరంలో ఈ కీళ్లు ఉగ్రరూపం దాలిస్తే కాలు, చేయి మెదపాలంటే కష్టం. మారు తున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు అనేక రకాల అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంటాయి. అందులో ఆర్థరైటిస్ కూడా ఒకటి. ఇది గ్రీకు పదాలైన "ఆర్త్రో" నుండి ఉద్భవించింది, అంటే "ఉమ్మడి", మరియు "ఐటిస్", అంటే "మంట". మానవ ఆర్థరైటిస్ యొక్క మొట్ట మొదటి జాడలు క్రీ.పూ 4500 నాటివి. ప్రారంభ నివేది కలలో, ఆర్థరైటిస్‌ను చరిత్రపూర్వ ప్రజల అత్యంత సాధారణ వ్యాధిగా సూచిస్తారు. కీళ్ల అరుగుదలనే ఆర్థరైటిస్ అంటాం. కీళ్ల నొప్పులు అధికంగా తుంటి, మోకాలులో వస్తుంటాయి. చేతి, మోచేతిలోనూ కీళ్ల నొప్పులు రావచ్చు. శరీరంలో మోకాలే పెద్ద కీలు. శరీర బరువును సగానికిపైగా మోకాలే మోస్తుంటుంది. వయసు పెరుగుతున్న కొద్దీ కీళ్లలో ఉండే కీలకమైన మృదులాస్థి అనే పదార్థం కరిగిపోతుంది. అది నిరంతరం కరుగుతూ మళ్లీ ఏర్పడు తుండటం దాని ప్రత్యేకత. అయితే 40–45 ఏళ్ల మధ్య మృదులాస్థి పున రుత్పత్తి తగ్గడం మొదలవుతుంది. దీంతో కీళ్లవాపు, నొప్పి, నడవలేక పోవడం వంటివి వస్తాయి. ఈ విధంగా జరగడాన్నే కీళ్ల నొప్పి లేదా ఆర్థరైటిస్ అంటారు. కీళ్లనొప్పికి జన్యు పరమైన కారణాలూ ఉంటాయి. ప్రధానంగా వయసు, జన్యు పరమైన కారణాలతోనే ఆర్థరైటిస్ వస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఎంకైలోడింగ్ ఆర్థరైటిస్ అనే 2 రకాలున్నాయి. సాధారణ ఆర్థరైటిస్‌కు ఈ రెండూ భిన్నం. ఈ రెండింటిలో ఉపశాఖలుగా మరో 15 ఆర్థరైటిస్‌లు ఉన్నాయి. ఒకసారి తగులుకుంటే వదిలి పెట్టవు. పూర్తిగా నిర్మూలించలేం. స్టెరాయిడ్స్ తదితర మందులు వాడటం వల్ల వీటిని నియంత్రించ వచ్చు. ఇక సోరియాసిస్ కూడా ఆర్థరైటిస్‌కు దారితీస్తుంది. రీటస్ డిసీజ్ అంటే కంటి చూపు మంద గించడం ద్వారా కీళ్ల నొప్పులు వచ్చే అవకాశ ముంది. ఇలాంటి జబ్బులు వస్తే 20–30 ఏళ్లకే ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. గతంలో 50–60 ఏళ్లలో కనిపించే ఆర్థరైటిస్‌ను ఇప్పుడు 35–40 ఏళ్లలోనే చూస్తున్నాం. దీన్ని ముందుగా గుర్తించి నియంత్రణ చర్యలు తీసుకోక పోతే మున్ముందు నడవలేని, కదల్లేని పరిస్థితులు రావొచ్చని వైద్యులు హెచ్చరి స్తున్నారు. కింద కూర్చోవడం వల్ల, సాధారణ మరుగుదొడ్లు వాడినా మోకాలి నొప్పులు వస్తాయి. ఈ కీళ్లకు వచ్చే అతి పెద్ద సమస్య ఆర్థ్రైటిస్! అంటే కీలు లోపలంతా వాచి పోయి కదపా లంటేనే తీవ్రమైన నొప్పి, బాధతో జాయింటులో అరిగి పోవడం వల్ల రావచ్చు. దాన్ని "ఆస్టియో ఆర్థ్రైటిస్" అంటారు. ఇప్పుడు ఎక్కువ మంది అనుభవిస్తున్న మోకాళ్ల నొప్పుల బాధ ఇదే. ఇక ఒంట్లో ఏదైనా ఇన్ఫెక్షన్ తలెత్తి అది కీలుకు చేరటం వల్ల కీళ్లనొప్పి రావచ్చు. దీన్ని "ఇన్ఫెక్టివ్ ఆర్థ్రైటిస్' అంటారు. సొరియాసిస్ వంటి చర్మ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపు, నొప్పి పలకరించవచ్చు. దాన్ని "సొరియాటిక్ ఆర్థ్రైటిస్" అంటారు. అలాగే మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, నీళ్ల విరేచనాల వంటి ఇన్ఫెక్షన్ల తర్వాత కూడా కీళ్ల వాపు రావచ్చు. దాన్ని "రియాక్టివ్ ఆర్థ్రైటిస్" అంటారు. చికున్‌గన్యా వంటి వైరల్ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపులు రావచ్చు, వీటిని "వైరల్ రియాక్టివ్ ఆర్థ్రైటిస్" అంటారు. ఇలా కీళ్ల వాపుల్లో ఎన్నో రకాలు న్నాయి. అయితే ఇవన్నీ కూడా ఏదో ఒక ప్రత్యేకమైన, స్పష్టమైన కారణంతో వచ్చే కీళ్ల నొప్పులు! వీటికి భిన్నంగా... స్పష్టమైన కారణమేదీ తెలియ కుండానే ఆరంభమయ్యే అతి పెద్ద సమస్య... రుమటాయిడ్ ఆర్థ్రైటిస్! కీళ్లవాతం!! వేళ్లు, మణికట్టు వంటి చిన్న జాయింట్లను ఎక్కువగా పట్టి పీడించే ఈ కీళ్లవాతం.. దీర్ఘకాలం ఉండిపోయే సమస్య! దీన్ని నిర్లక్ష్యం చేస్తే శరీరంలో గుండె, ఊపిరితిత్తులు, కళ్ల వంటి ఇతరత్రా అవయవాలూ ప్రభావితమై పరిస్థితి మరింత విషమిస్తుంది. అదృష్టవశాత్తూ– దీన్ని పూర్తి నియంత్రణలోకి తీసుకు వచ్చే విధానాలు అందుబాటులో ఉన్నాయి. అందుకే 'ప్రపంచ ఆర్థ్రైటిస్ దినం' సందర్భంగా ఈ కీళ్లవాతం గురించి అవగాహన కలిగి వుండాలి. మన శరీరంలో ఒక అద్భుతమైన రక్షణ వ్యవస్థ ఉంది. అదే 'రోగ నిరోధక వ్యవస్థ'. మనం వ్యాధుల బారినపడకుండా.. ఎటువంటి సూక్ష్మక్రిములూ మనపై దాడి చెయ్యకుండా నిరంతరం పహారా కాస్తుందీ వ్యవస్థ. రేయిం బవళ్లు ఈ బాధ్యతలను ఇది అద్భుతంగా నిర్వర్తిస్తుంటుంది. కానీ.. ఒక్కోసారి ఇది ఏకంగా మన శరీర భాగాల మీదే దాడి చేసేస్తుంది. ఫలితమే రకరకాల 'ఆటో ఇమ్యూన్' సమస్యలు. కీళ్లవాతం.. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ కూడా ఇలా తలెత్తే సమస్యే! ఇది మన కీళ్లలో ఎముకల మధ్య ఉండే మృదువైన 'సైనోవియం' పొరను చూసి, దానిపై దాడి చేసి దెబ్బతీయటం ఆరంభిస్తుంది. దీంతో కీళ్లు ఎర్రగా వాచిపోవటం, నొప్పుల వంటి బాధలన్నీ ఆరంభ మవుతాయి. సాధారణంగా ఇతరత్రా కీళ్ల నొప్పులైతే శరీరంలోని ఏదో ఒకవైపు కీలుకు మాత్రమే వస్తాయి. కానీ రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌లో– ఒకేసారి రెండు వైపులా వాపు కనిపిస్తుంది. అంటే ఉదాహరణకు కుడి చేతి వేలి కీళ్లు వాస్తే, ఎడమ చేతి వేలి కీళ్లు కూడా వాస్తుంటాయి. కుడి మణికట్టు కీలు వాస్తే, ఎడమ మణికట్టు కీలూ వాస్తుంది. అలాగే ఈ వాపు ఏకకాలంలో శరీరంలోని చాలా కీళ్లకూ రావచ్చు. కీళ్లవాతం ఏ వయసు వారికైనా రావచ్చుగానీ సాధారణంగా పెద్దవారి లోనే.. అదీ 30–60 ఏళ్ల మధ్య వయసు వారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. ముఖ్యంగా– ఇది మహిళల్లో ఎక్కువ. కీళ్లవాతం సాధారణంగా శరీరంలోని చిన్న కీళ్లతో మొదలవు తుంది. అంటే చేతివేళ్లు, మణికట్టు, కాలివేళ్ల వంటి వాటితో ఆరంభమై క్రమేపీ మోకాలు, తుంటి వంటి పెద్ద జాయింట్లకూ రావచ్చు. వాపు, నొప్పి వంటివన్నీ చిన్న జాయింట్లతో ఆరంభం కావటం దీని ప్రత్యేక లక్షణం. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ బాధితుల్లో చాలా కొద్దిమందికి మాత్రమే కీళ్ల మార్పిడి అవసరం అవుతుంది. కీళ్లవాతం కొంతకాలం పెరుగుతూ తగ్గుతూ ఉండటం దీని మరో ప్రత్యేకత. కీళ్లవాతం వచ్చిన తొలిదశలో కీళ్ల మీది పైపొర మాత్రమే దెబ్బతింటుంది. వ్యాధి ముదురుతున్న కొద్దీ క్రమేపీ అది కీళ్లను, లోపలి ఎముకలను కొరికేస్తుంది. ఇంకా తీవ్రమైతే కీళ్ల మధ్య ఖాళీ తగ్గిపోతుంది. దీంతో ఎముకల రాపిడి కారణంగా నొప్పి వస్తుంది. కొన్నాళ్లకు కీళ్లు మొత్తం దెబ్బతింటాయి. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌ను నియంత్రించు కోకపోతే – గుండె జబ్బులు, పక్షవాతం వంటివి పదేళ్ల ముందుగానే వచ్చే ప్రమా దం ఉంది. కళ్లు పొడిబారటం, లాలాజలం తగ్గిపోవటంతో పాటు గుండె చుట్టూ, వూపిరితిత్తుల చుట్టూ నీరు చేరటం వంటి ఇబ్బందులూ ఎదురవ్వచ్చు. వ్యాధిని సత్వరమే గుర్తించి చికిత్స ఆరంభిస్తే ఈ కీళ్ల మార్పిడి అవసరం అంతగా రాదు. చిన్న కీళ్లకు ఈ మార్పిడి అవకాశమూ ఉండదు. అందుకే మందులతో చికిత్సకే ప్రాధాన్యం ఇస్తారు. కీళ్లవాతం బాధితుల్లో చాలామంది పూర్తి విశ్రాంతిగా పడుకుంటూ వ్యాయామం మానేస్తుంటారు. ఇది సరికాదు. వ్యాయామం చేయకపోతే కీళ్లు గట్టిగా బిగుసుకు పోతాయి. కొన్నిసార్లు ఆపరేషన్ చేసినా ఫలితం ఉండక పోవచ్చు. మందులతో నొప్పి తగ్గాక వ్యాయామం మొదలెట్టాలి. నొప్పి తగ్గుతున్న కొద్దీ వ్యాయామం చేసే సమయాన్ని కూడా పెంచుకోవాలి. ఏరోబిక్, యోగా, నడక వంటి వ్యాయామాలు ఏవైనా చేయొచ్చు. పొగ తాగకూడదు. బరువు పెరగ కుండా, శరీరానికి తగ్గట్లుగా ఉండాలి. ఆర్థరైటిస్‌ను ముందుగా గుర్తించకపోతే పనిచేసే సామర్థ్యం తగ్గిపోతుంది. దీనివల్ల శరీరంలో కొవ్వు పెరిగిపోతుంది. ఫలితంగా గుండెకు చేటు తెస్తుంది. అలాగే మెటబాలిజం తగ్గుతుంది. దీంతో ఒత్తిడి పెరుగుతుంది. మన జనాభాలో సుమారు ఒక శాతం మంది దీంతో బాధపడు తున్నారు. కీళ్ల 20 శాతం అరుగుదల ఉంటే, దాన్ని పెరగకుండా చూసుకోవాలి. మృదులాస్థి పెరగడానికి మందులు ఇస్తారు. అవి వాడాలి. సైక్లింగ్, ఈత వంటివి చేయాలి. దీని వల్ల కీళ్లపై ప్రభావం చూపదు. నిర్ణీత మోతాదులో డాక్టర్ల సూచన మేరకు నడవవచ్చు. ఏదైనా సమతుల్య మైన శారీరక శ్రమ, వ్యాయామం అవసరం. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ దీర్ఘకాలిక సమస్య. కాబట్టి చికిత్స కూడా దీర్ఘకాలం, జీవితాంతం తీసుకోవాల్సి ఉంటుంది.

# రామగిరి మండల సమాఖ్య కార్యాలయం వద్ద హత్య కేసులో నిందితుల అరెస్ట్

**24 గంటల్లో నిందితుల అరెస్ట్, రిమాండ్ కి తరలింపు**
**వేధింపులు, బెదిరింపులు తట్టుకోలేక హత్య**

రామగుండం మండలం, రిపోర్టర్-
(శుభోదయం న్యూస్):



పెద్దపల్లి జోన్ రామగిరి మండలం సెంటినరి కాలనీ డి ఆర్ డి ఏ, టిజీ ఎస్ ఇ ఆర్ ఎఫ్ ఆఫీస్ వద్ద జరిగిన హత్య కేసు లో నిందితుల అరెస్ట్ వివరాలు గోదావరిఖని ఏసిపి ఎం రమేష్ లు వెల్లడించడం జరిగింది. మృతుని వివరాలు, కోట చిరంజీవి రాజయ్య 35 సంవత్సరాలు, కులం ఎస్సీ నేతకాని, న్యూ మారేడు పాక, నిందితుల పూర్తి వివరాలు. 1. పొలవైన సంధ్యారాణి భర్త పేరు: కుమార్, వయసు :34 సంవత్సరాలు కులం: తెనుగు గ్రామం :పెంచికల్ పేట్ 2. అనవేనా మల్లయ్య, తండ్రి పేరు :రాములు, వయసు :62 సంవత్సరాలు, కులం: తెనుగు, గ్రామం పెంచికల్ పేట్, 3. అనవేన నరేష్, తండ్రి పేరు: మల్లయ్య, వయసు:37 సంవత్సరంలు ,కులం: తెనుగు గ్రామం :పెంచికల్ పేట్, 4.పొలవెన కుమార్, తండ్రి పేరు: సాయిలు వయసు: 36 సంవత్సరంలు, కులం :తెనుగు గ్రామం పెంచకల్ పేట్, పిడుగు చందు, తండ్రి పేరు :లచ్చయ్య, వయస్సు: 26 సంవత్సరాలు, కులం,తెనుగు గ్రామం పెంచికల్ పేట్, స్వాధీనం చేసుకొన్నా వాటి వివరాలు మూడు బైక్ లు,హత్య కు ఉపయోగించిన వస్తువులు, తేదీ10-10-2025 రోజున మృతుడు కోట చిరంజీవి తమ్ముడైన కోటా రామ్ చరణ్ తండ్రి పేరు: రాజయ్య వయసు :29 సంవత్సరంలు, కులం :ఎస్సీ నేతకాని ఫిర్యాదు మేరకు రామగిరి లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగింది. పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపెల్లి డిసిపి కరుణాకర్ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు లో భాగంగా హత్య కు పాల్పడిన నిందితులను పట్టుకొనుటకు మడత రమేష్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గోదావరిఖని ఆధ్వర్యంలో మంథని సీఐ రాజు, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, రామగిరి ఎస్ ఐ లు టి శ్రీనివాస్, పి దివ్య కమాన్ పూర్ ఎస్ఐ ప్రసాద్, ముత్తారం ఎస్ ఐ రవి కుమార్, సిబ్బంది శనివారం రోజున ఐఓసీ పెట్రోల్ బంక్ దగ్గర గల పెంచికల్ పేట్ ఎక్స్ రోడ్ వద్ద ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు మోటార్ సైకిల్ పై వెళ్తుండగా పట్టుకొని వారిని వెంటనే అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించి అరెస్ట్ చేసి ఈరోజు రిమాండ్ చేస్తున్నట్టు ఏసీపీ తెలిపారు. వివరాల్లోకి వెళితే మృతుడు కోట చిరంజీవి రాజయ్య 35 సంవత్సరాలు, కులం ఎస్సీ నేతకాని చెందిన అనునాతడు న్యూ మారేడుపాక గ్రామానికి చెందిన నివాసుడు. ఇతను పోతన కాలనీలో మీ సేవా సెంటర్ ని నడుపుకుంటూ జీవిస్తాడు. ఇతని భార్య 2019 సంవత్సరంలో చనిపోయినది. నిందితురాలు ఒకరోజు పని నిమిత్తం పోతన కాలంలోని మీ సేవకు వెళ్ళినప్పుడు చిరంజీవిని కలిసింది. అప్పటి నుంచి నిందితురాలికి చిరంజీవి కాల్స్ మరియు మెసేజ్ చేసేవాడు. ఆ క్రమంలో మృతుడు నిందితురాలు అంటే ఇష్టమని తనతో ఉంటానని చెప్పి ఒప్పుకొక పోతే చంపుతానని బెదిరించడంతో నిందితురాలు భయపడి అతనితో మాట్లాడేది కొంతకాలం తర్వాత అతనితో మాట్లాడక పోవడం, అతని దూరం పెట్టడం చేయడంతో నిందితురాలని, తన భర్తని, తల్లిదండ్రులను చంపుతానని బెదిరించేవాడు. రెండు నెలల క్రితం మృతుడి చిరంజీవి వేధింపులు భరించలేక నిందితురాలు తన భర్తకు విషయం తెలుపడం జరిగింది. మృతుడు నిందితురాలు భర్తకు ఫోన్ చేసి నిన్ను నీ భార్యని చంపుతా మీ పరువు తీస్తా అంటూ బెదిరించేవాడు. నెల రోజుల క్రితం ఊర్లో పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ కూడా నిర్వహించడం జరిగింది. అయినా మృతుడు చిరంజీవి ప్రవర్తనలో మార్పు రాక పోగా నిందితురాలి ఊర్లో అందరితో తన గురించి చెడుగా చెప్తూ పెళ్లి చేసుకున్నానని, అతనితో లేచిపోయినది అని చెడుగా చెప్పేవాడు.తేది:10-10-2925 రోజున నిందితురాలు పని చేసే సెంటినరీ కాలనీ సమైక్య కార్యాలయం వద్దకు చిరంజీవి రావడంతో సంధ్య రాణి భయపడి తన భర్త మరియు అన్నయ్య కు ఫోన్ చేసి రమ్మనీ చిరంజీవి ఎంత చెప్పినా వినకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఎలాగైనా అతని చంపాలని నిందితురాలు అన్న నాన్న మరియు భర్తతో చెప్పింది. చిరంజీవి ఆఫీస్ వద్దకి వచ్చి నిందితురాలి తో గొడవ పడుతుండగా అదే సమయం లో అక్కడికి వచ్చిన నిందితురాలి అన్న, భర్త,తండ్రి మరియు బావమరిది చిరంజీవి తో గొడవపడి చేతులతో కొట్టి చిరంజీవిని ఎలాగైనా చంపాలని ఉద్దేశంతో నిందితురాలు తండ్రి తనతో తీసుకువచ్చిన ఇనుపరాడు మరియు చాకుతో గాయ పరచగా, అన్న మరియు బావమరిది అతని గట్టిగా పట్టుకున్నారు. నిందితురాలి తండ్రి చిరంజీవిని చంపాలని ఉద్దేశంతో రాడుతో చాలాసార్లు చిరంజీవి తలపై కొట్టడంతో తలపై బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు.దీనిని షార్ట్ గా రాయ్ న్యూస్ కి ఇవి "రామగిరి మండల సమాఖ్య కార్యాలయం వద్ద హత్య కేసులో నిందితుల అరెస్ట్ 24 గంటల్లో నిందితుల అరెస్ట్, రిమాండ్ కి తరలింపు వేధింపులు, బెదిరింపులు తట్టుకోలేక హత్య రామగుండం మండలం, రిపోర్టర్- (శుభోదయం న్యూస్):" ఇవిగా ఉంచు

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం అవ్వండి





**ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు**

జుక్కల్, ఆర్ సి ప్రతినిధి - సయ్యద్ అతిక్
(శుభోదయం న్యూస్):

కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో ముందుకు వెళ్తుందని అన్నారు.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చుని..అన్ని విధాలుగా ఎన్నికలకు సిద్ధం అవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు..నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతీ ఒక్కరినీ కలుపుకొని వెళ్లాలని చెప్పారు..పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని భరోసా కల్పించారు.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మరియు నియోజకవర్గంలో మనం చేపట్టిన అభివృద్ధి పనుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు..ప్రతిపక్షాల విమర్శలకు ఎప్పటికప్పుడు ధీటుగా బదులిస్తూ, ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు..స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తా చాటి కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని, ఆ దిశగా వ్యూహాత్మకంగా పని చేయాలని క్యాడర్ కు దిశా నిర్దేశం చేశారు..జుక్కల్ఎల్ ఓ సి నియోజకవర్గంలో 20 నెలల్లో సుమారు రూ. 9 కోట్ల విలువ చేసే ఎల్ ఓ సి మంజూరు చేశామని, పేదల సంక్షేమం, ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు..

# సింగరేణి పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమం!

**అక్టోబర్ 25న కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం గోదావరిఖనిలో**

రామగుండం మండలం, రిపోర్టర్
(శుభోదయం న్యూస్):



సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశము తేదీ 10/10/25న శ్రీరాంపూర్ ఐ ఎఫ్ టి యు కార్యాలయంలో జరిగింది. ఐఎఫ్టియు,టీ ఎస్ యు ఎస్, ఏ ఐఎఫ్టియు,టీ ఎన్ టి యు సి కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు సింగరేణి బ్లాకులు సింగరేణికే చెందాలని సింగరేణి కంపెనీ వేలంలో పాల్గొనడం సరి అయినటువంటిది కాదని సమావేశం అభిప్రాయపడింది. రానున్న కాలంలో బొగ్గ బావులు కొన్ని మూతపడనున్న నేపథ్యంలో కొత్త బావుల నిర్మాణం చేపట్టకుండా ఇతర రాష్ట్రాలలో ఇతర వ్యాపారాల కోసం సింగరేణి చైర్మన్ ప్రయత్నించడం సోచ నీయమని. కార్మికుల వారసుల మారుపేర్ల సమస్య, కారుణ్య నియామకాలు రద్దు చేసే పరిస్థితి, మణుగూరు ఇల్లందు భవిష్యత్తు ప్రశ్నార్థకంమైందని నాయకులు అభిప్రాయపడ్డారు డిస్మిస్ కార్మికుల సమస్యలు మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం కొత్త బావుల నిర్మాణం చేపట్టకపోవడం సింగరేణి బ్లాకుల్ని సింగరేణి నడుపు కోలేకపోవడం ఇవన్నీటి ఫలితంగా సింగరేణికి భవిష్యత్తు లేదని సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులు ఆందోళన చెందుతున్నారని ఈ సందర్భంలో సింగరేణిలో పనిచేస్తున్నటువంటి సింగరేణి కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం గోదావరిఖనిలో నిర్వహించి అందరి అభిప్రాయాలకు అనుకూలంగా సింగరేణి రక్షించుకోవడం కోసం తగిన నిర్ణయాలు తీసుకుంటామని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది ఈ సమావేశంలో ఐ ఎఫ్ టు యు నుండి టీ. టి శ్రీనివాస్, ఐ కృష్ణ, ఎం. రాములు, టీ ఎస్ యు ఎస్ నుండి నీరటి రాజన్న, జైపాల్ సింగ్, సంపు రాజన్న, ఐ ఎఫ్ టు యు నుండి జి. రాములు, పోషమల్లు, అంజయ్య టిఎన్టియుసి టిఎన్టియుసి నుండి మని రామ్ సింగ్, ఏడుకొండలు, పెగడపల్లి రాజనర్సు తో పాటు ఐక్యవేదిక కార్మిక సంఘాల సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ శంకర్ రావు జన్మదిన వేడుకలు

తెలంగాణ స్టేట్, బ్యూరో,దొమ్మాటి శివ కుమార్(శుభోదయం న్యూస్):



కంటోన్మెంట్ బొల్లారం రిసాల బజార్ లో రోహిణి ఫ్యామిలీ హెల్త్ సెంటర్ లో సేవారత్న అవార్డు గ్రహీత,ప్రముఖ వైద్యులు కొమ్ము శంకర్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మార్కెట్ కమిట్ మాజీ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి,సీనియర్ నేతలు డాక్టర్ శంకర్ రావు ని ఘనంగా సన్మానించి కేక్ కట్ చే పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో డాక్టర్ శంకర్రావు కృషి అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పేదలకు మరింత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ను కలసి అభివృద్ధి నిధుల గురించి చర్చించిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

గోదావరిఖని టౌన్, రిపోర్టర్(శుభోదయం న్యూస్):



రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు శనివారం రోజున ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ కోయ శ్రీహర్ష ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామగుండం నియోజకవర్గ అభివృద్ధి సంబంధిత పలు అంశాలపై చర్చించారు. ఇందిరమ్మ హౌసింగ్ బిల్లులు త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరారు. అదేవిధంగా,రామగుండం మరియు పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం ఎన్ టి పి సి సంస్థ సీస్సార్ నిధుల నుండి తగిన నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గాం మరియు పాలకుర్తి మండలాలలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి కావలసిన నిధులను కేటాయించాలని కూడా ఎమ్మెల్యే కోరారు.రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం మరియు అధికార యంత్రాంగం సమన్వయంతో కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

## ఈనెల 19న దసరా దీపావళి ఉత్సవాలు -2025

గోదావరిఖని టౌన్, రిపోర్టర్(శుభోదయం న్యూస్):

గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో అంగరంగ వైభవంగా తేదీ:19-10-2025 (ఆదివారం)సమయం: సాయంత్రం 6:00 గంటల నుండి స్థలం: జవహర్లాల్ నెహ్రూ స్టేడియం, గోదావరిఖని ఉత్సవాన్ని నిర్వహిస్తున్నవారు మన స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ సింగరేణి యాజమాన్యం, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, ఎన్.టి.పి.సి. వారి సౌజన్యం. ప్రధాన వినోద కార్యక్రమాలు: సినీ మరియు మిమిక్రీ స్టార్ శివారెడ్డి సినీ నటుడు శ్రీ అలీ, గాయని శ్రీమతి గీతా మాధురి, జబర్దస్త్ బుల్లెట్ భాస్కర్ టీం, గోవింద్ డాన్స్ గ్రూప్ వారి బృందాల నుండి పాటలు, డ్యాన్స్‌లు, వినోద కార్యక్రమాలు ౦ప్రేక్షకులను అలరించే అద్భుత ప్రదర్శనలు! ప్రత్యేక ఆకర్షణఘన మైన రావణ దహనం కార్యక్రమం. ఆకాశాన్ని అలరించే పటాకుల ప్రదర్శన! రుచుల సమ్మేళనం పలు రకాల ఫుడ్ స్టాల్స్ ఆకర్షణీయమైన ఎగ్జిబిషన్లు రామగుండం పట్టణ ప్రజలు, సింగరేణి ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులు, అన్ని సంఘాల నాయకులు, ఎన్.టి.పి.సి. ఉద్యోగులు మరియు కుటుంబ సభ్యులందరూ ౦అధిక సంఖ్యలో పాల్గొని ఈ సాంస్కృతిక వేడుకలను ఆనందించండి!

## రామగుండం ఎయిర్‌పోర్ట్ కల దిశగా మరో అడుగు

**పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ**

రామగుండం మండలం, రిపోర్టర్(శుభోదయం న్యూస్):



రాష్ట్ర ప్రభుత్వం శనివారం రోజున అధికారికంగా ?40.53 లక్షలు మంజూరు చేసి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ( ఏ ఏ ఐ) కు ప్రీ-ఫిజిబిలిటీ స్టడీ ఫీజు చెల్లించింది. ఇది రామగుండం ఎయిర్‌పోర్ట్ స్థాపన దిశగా ఒక చారిత్రాత్మక ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ (టి ఆర్ బి) ఈ ఆదేశాలు జారీ చేసింది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం లో 591 ఎకరాల భూమి పై గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు ప్రతిపాదనపై ఈ స్టడీ జరగనుంది. వంశీకృష్ణ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా మనం కోరుకున్న రామగుండం ఎయిర్‌పోర్ట్ కల ఇప్పుడు సాకారం అవుతోంది. ఈ ఎయిర్‌పోర్ట్ ద్వారా మన పెద్దపల్లి పార్లమెంట్ ప్రజలకు, సింగరేణి సిబ్బందికి, విద్యార్థులకు, వ్యాపార వర్గాలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుంది. హైదరాబాద్‌కి గంటల కొద్దీ ప్రయాణం చేసే అవసరం లేకుండా ప్రత్యక్ష కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఇది మన ప్రాంతానికి నూతన ఆర్థిక, పారిశ్రామిక అవకాశాలను తెస్తుంది అని అన్నారు.అలాగే ఆయన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ,ఈ అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాను. ప్రీ-ఫిజిబిలిటీ స్టడీ పూర్తయిన తరువాత, సెంటర్ ఫిజిబిలిటీ స్టడీ చేపడుతుంది. రామగుండంలో ఎయిర్‌పోర్ట్ స్థాపన వరకు నా పోరాటం ఆగదు అని గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.ఆయన కాకా గారి ఆత్మను స్మరించుకుంటూ, పెద్దపల్లి ప్రజల ఆశీర్వాదం మరియు మద్దతుతో ఈ కలను నిజం చేసే వరకు తాను అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.

## బీసి రిజర్వేషన్ల కోసం బంద్

**హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ ఈ నెల 14న తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు బీసీ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఆయన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వారు తనకు తెలియజేశారని ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు.బీజేపీ నేతలను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, హైకోర్టు స్టేకు నిరసనగా, అలాగే ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిరసిస్తూ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చామని అన్నారు. 22 బీసీ సంఘాలు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే సమయంలో హైకోర్టు స్టే విధించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. తమ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. బీసీల నోటికాడి ముద్దను లాక్కుంటున్నారని ఆయన విమర్శించారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో బీజేపీతో సహా అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు. ఇది బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని ఆయన అన్నారు. వ్యవస్థల మీద, ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచడానికే ఈ బంద్ అని స్పష్టం చేశారు. బీసీలను చిన్నచూపు చూస్తున్నారని, అందుకే తమ సత్తా ఏమిటో చూపిస్తామని ఆయన అన్నారు.

## రేవంత్ పులి కాదు పిల్లి...

**హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు... నల్లమల పిల్లి" అని ఆయన ఘాటుగా విమర్శించారు. పొరుగు రాష్ట్రాలు కృష్ణా, గోదావరి జలాలను తరలించుకుపోతుంటే తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో సీఎం పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. శనివారం నాడు తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకు ఇటీవల కర్ణాటకకు వెళ్లిన రేవంత్ రెడ్డి, అక్కడి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌తో ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు అంశంపై ఎందుకు మాట్లాడలేదని హరీశ్ రావు నిలదీశారు. "ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుతుందన్న కనీస సోయి రేవంత్ రెడ్డికి లేదు. సొంత పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక ప్రభుత్వంతో రాహుల్ గాంధీ ద్వారా ఒక్క ఫోన్ కూడా చేయించలేని స్థితిలో ఆయన ఉన్నారు" అని విమర్శించారు. ఢిల్లీకి బ్యాగులు మోయడమే కాకుండా, రాష్ట్ర బాగోగులను కూడా పట్టించుకోవాలని హితవు పలికారు.పొరుగు రాష్ట్రాల నీటి వినియోగంపై హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. "ఏపీ 463 టీఎంసీలు, కర్ణాటక 112 టీఎంసీలు, మహారాష్ట్ర 74 టీఎంసీల నీటిని ఆపుకుంటే మన పరిస్థితి ఏంటి? కింద గోదావరి, పైన కృష్ణా నీళ్లు వాళ్లు తీసుకుపోతే మన బతుకులు ఏం కావాలి?" అని ఆయన ప్రశ్నించారు.తరచూ తనను తాను 'నల్లమల బిడ్డ' అని చెప్పుకునే రేవంత్ రెడ్డి, నల్లమలను ఆనుకుని ప్రవహించే కృష్ణా నదికి, మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరుగుతుంటే ఎందుకు స్పందించడం లేదని హరీశ్ రావు మండిపడ్డారు. "నువ్వు నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా? పులి అయితే గర్జించేవాడివి. పిల్లివి, ఎలుకవు కాబట్టే మౌనంగా ఉన్నావు" అంటూ తీవ్ర పదజాలంతో విమర్శలు గుప్పించారు.

## భవానీ నీ ధైర్యం సూపర్

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో చోటుచేసుకున్న ఓ సంఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిన్న వయస్సులోనూ అసాధారణ ధైర్యం చూపిన ఓ బాలిక అందరి ప్రశంసలు అందుకుంటోంది.వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ జిల్లా చింతల్‌లోని భగత్‌సింగ్ నగర్‌లో గురువారం మధ్యాహ్నం ఓ వ్యక్తి చోరీకి యత్నించాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో.. దొంగ పక్కా ప్లాన్ వేసుకుని వచ్చాడు. తాళాలు వేసి లేని ఇంటి తలుపు తెరిచి లోపలికి దూరాడు. భగత్ సింగ్ నగర్ రోడ్ నెంబర్ 12లో ఉమామహేశ్వరి ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. ఉదయం ఇంటికి తాళం వేసి పనికి వెళ్లిపోయింది. పైన ఉన్న ఓనర్ కుమార్తె భవాని ఏదో పని మీద బయటకు వెళ్లేందుకు దిగింది. ఇంతలో ఉమా ఇంట్లో తలుపులు కాస్త తెరిచి ఉండటాన్ని గమనించింది. ఆమె పనికి వెళ్లింది కదా ఇంట్లో ఉన్నదెవరో అని ఉమ ఆంటీ అని పిలిచింది. లోపలి నుంచి సమాధానం రాలేదు. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూసింది. బెడ్‌రూంలో గుర్తు తెలియని వ్యక్తి కనిపించాడు. భవాని రావడాన్ని చూసిన దొంగ కూడా తప్పించుకునేందుకు ఎత్తు వేశాడు. తాను కూడా ఉమా కోసమే వచ్చినట్టు చెప్పాడు. అయితే ఆమె ఇంటికి మీరు ఎప్పుడూ రాలేదని ఎందుకు వచ్చారని ప్రశ్నించింది. వచ్చిన వాళ్లు బెడ్రూమ్‌లో ఏం చేస్తున్నారని నిలదీసింది. అంతే కాదు. అతని జేబులు, చేతులు చెక్ చేసింది. పరిస్థితి చేయి దాటిపోయిందని గ్రహించిన దొంగ భవానీని తోసేసి అక్కడి నుంచి పరారయ్యాడు. దొంగ నెట్టేయడంతో కింద పడిపోయిన భవాని గట్టిగా కేకలు వేసింది. దొంగా... దొంగా... అని అరిచింది. అయినా ఎవరూ పట్టించుకోలేదు. చివరకు తానే లేచి దొంగ వెంట పరుగెత్తింది. వీధికి సమీపంలో ఉన్న స్కూల్ వద్ద తెలిసిన వాళ్ళు కనిపిస్తే దొంగ వెళ్తున్నాడు పట్టుకోండని అరిచింది. వాళ్లు నువ్వే పట్టుకోపో అని వదిలేశారు. అప్పటికే దొంగ చాలా దూరం వెళ్లిపోయాడు. కనిపించకుండా పోయాడు. తిరిగి ఇంటికి వచ్చి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. అప్పుడు అప్రమత్తమైన తల్లిదండ్రులు ఉమాకు విషయాన్ని చేరవేశారు. వెంటనే మా భర్త ఇంటికి వచ్చి ఏం జరిగిందో తెలుసుకున్నాడు. మొత్తం చెక్ చేసి వస్తులేవీ పోలేదని తేల్చారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీటీవీ ఫుటేజ్‌లో కూడా భవాని దొంగ వెంట పరుగెత్తుతున్నట్టు రికార్డు అయ్యి ఉంది. అనుమానం వచ్చిన వెంటనే స్పందించి వస్తువులు చోరీ కాకుండా చూసిన భవానిని స్థానికులు అభినందించారు. సరైన సమయంలో స్పందించినందుకు ఉమా ఫ్యామిలీ కృతజ్ఞత చెప్పారు. ఆమె కేకలకు స్పందించి చుట్టుపక్కల వాళ్లు సరైన టైంలో స్పందించి ఉంటే దొంగను పట్టుకునే వాళ్లమని అంటున్నారు.

## నగరానికి.. స్పెయిన్ ప్రెస్టో..

**హైదరాబాద్ :** ప్రపంచవ్యాప్తంగా దుస్తులు, యాక్సెసరీస్ సంరక్షణలో అగ్రగామిగా పేరుపొందిన ప్రెస్లో ఇండియా తొలిసారిగా హైదరాబాద్లో అడుగుపెట్టింది. బంజారాహిల్స్ లో నూతనం గా ఏర్పాటు చేసిన స్టోర్లతో తెలంగాణాలో ప్రెస్టో సేవలు అందుబాటులోకి వచ్చాయి. పర్యావరణహిత సేవలందించడం ప్రెస్టో ఇండియా ప్రత్యేకత, మృదువైన క్లీనింగ్ విధానాలతో అత్యాధునిక పరికరాలను ఉపయోగించడం ద్వారా దుస్తుల జీవిత కాలాన్ని పెంచుతూ, వ్యర్థాలను తగ్గిస్తూ, పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గిస్తుంది. ఈ సందర్భంగా ప్రెస్టో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ య్వో మెట్ జెలార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ వాసులు అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన దుస్తుల సంరక్షణ సేవలను పొందడానికి అర్హులని తెలిపారు. వారికి తగిన సౌలభ్యం, నాణ్యతతో కూడిన సేవలు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. సంస్థ అందించే సేవల్లో డ్రై క్లీనింగ్, లాండ్రీ, దుస్తుల మార్పులు (అల్టరేషన్), షూ, బ్యాగ్ సం రక్షణ వంటి సేవలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 25 దేశాల్లో 300కి పైగా స్టోర్లతో ఇప్పటి వరకూ 1.5 కోట్లకు పైగా దుస్తులు, యాక్సెసరీస్కు సేవలందించామని పేర్కొన్నారు.

## నవంబర్ 26న పౌల్ట్రీ ఇండియా ఎక్స్ షో

**హైదరాబాద్ :** శరీరానికి తగిన పోషణ, ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజూ కోడిగుడ్డు తినాలని వక్తలు అన్నారు. ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) ఆధ్వర్యంలో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) సహకారంతో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో వరల్డ్ ఎగ్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకటేశ్వర హేచరీస్ గ్రూప్ ప్రతినిధి కేజీ ఆనంద్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్ శుశ్రుత కుమార్, పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన దేశం ప్రపంచంలోనే గుడ్ల ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉన్నప్పటికీ 2024లో వార్షిక తలసరి వాడకం కేవలం 108 గుడ్లేనని అన్నారు. ఎన్డే లాంటి సమయాల్లోనైనా గుడ్డు ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని కోరారు. నవంబర్ 20 నుంచి 28 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ పౌల్ట్రీ ఇండియా ఎక్స్పో 2025 పేరుతో దక్షిణ ఏషియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్పోలో 50 దేశాలకు చెందిన 500 మంది ఎగ్జిబిటర్లు, 50 వేల మందికి పైగా సందర్శ కులు పాల్గొంటారన్నారు.

# గోదావరిఖని బార్ అసోసియేషన్ మరియు కరీంనగర్ బార్ అసోసియేషన్ క్రికెట్ జట్ల మధ్య మ్యాచ్





**గోదావరిఖని టౌన్, రిపోర్టర్ - (శుభోదయం న్యూస్):**

బార్ అసోసియేషన్ గోదావరి ఖని క్రికెట్ జట్టు మరియు కరీంనగర్ బార్ అసోసియేషన్ క్రికెట్ జట్ల మధ్య రేపు ఉదయం స్నేహపూర్వకమైన మ్యాచ్ కలదు. ఈ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా రామగుండం కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షులు కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు టీ షర్టు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరిఖని బార్ అసోసియేషన్ క్రీడా జట్టు ఈ మ్యాచ్లో విజయం సాధించాలని ఆశించారు.అదే విధంగా ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని రోజువారి ఒత్తిడి నుంచి దూరం చేస్తాయని క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజిపి రవి కుమార్ క్రీడా మరియు సాంస్కృతిక కార్యదర్శి ఎరుకల ప్రదీప్ కుమార్ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ వరలక్ష్మి మాదాసు శీను కార్యవర్గ సభ్యులు మహమ్మద్ పంగ శంకర్ ఉమర్ లింగస్వామి రవికుమార్ కొప్పుల నరేష్ బోయిన శీను గుర్రాల రాజేందర్ తిలక్ క్రీడాకారులు పాల్గొనడం జరిగింది.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరాల్సిందే

**టిఆర్పీ జిల్లా నాయకుడు రవి పటేల్..**

**భూపాలపల్లిలో ధర్నా, రాస్తారోకో..**

**లీడర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు..**





**జయశంకర్ భూపాలపల్లి :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరాల్సిందేనని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పీ)జిల్లా నాయకుడు రవి పటేల్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్త బంద్ లో భాగంగా పార్టీ జిల్లా నాయకులు రవి పటేల్ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నా, రాస్తారోకో చేశారు. అంతకుముందు నాయకులు, కార్యకర్తలు కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న విషయాన్ని గమనించిన ఎస్సై సాంబమూర్తి ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తమ సిబ్బందితో వెళ్లి ధర్నా చేస్తున్న నాయకులను బలవంతంగా లాక్కెళ్లి, అదుపులోకి తీసుకుని వదిలేశారు. ధర్నా సందర్భంగా టిఆర్పీ జిల్లా నాయకుడు రవి పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలను అణిచివేయడానికి పెద్ద మొత్తంలో పోలీసులను మోహరించి ఉద్యమాన్ని అణిచివేసే విధంగా కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఏం జరిగినా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడేది లేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చే వరకు పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి పార్టీలకు బీసీలపై చిత్తశుద్ధి లేదని, 42 శాతం రిజర్వేషన్లపై అన్ని పార్టీలు తమ ద్వంద వైఖరిని ప్రకటిస్తున్నాయన్నారు. 64శాతం ఉన్న బీసీలు తమ రిజర్వేషన్ల కోసం తెలంగాణ ఉద్యమ తరహాలో మరో ఉద్యమం చేయవలసిన ఆవశ్యకత ఏర్పడిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ 9లో ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురాకుండా దొంగ కారణాలు చెప్పి వెనకబడేస్తున్నారని విమర్శించారు. అన్ని పార్టీలకు స్థానిక సంస్థల ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో లేదని, కావున ప్రజలంతా కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి నేతలను నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్పీ జిల్లా నాయకులు కరుణాకర్, చంద్రశేఖర్, సంతోష్, శ్రీను, వెంకన్న, సమ్మయ్య, నవీన్, అక్షయ్, సన్నీ, శంకర్రావు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాలకు చేయూతనందిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

**మేర సంఘ భవనానికి రూ. 20 లక్షలు మంజూరు చేసిన మంత్రి**

**మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మేరు సంఘం నాయకులు**

**బతుకమ్మ చౌక్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన మేర కులస్తులు**





**మంథని :** బడుగు బలహీన వర్గాలకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేయూతనందిస్తున్నారని అందులో భాగంగా మేర కులస్తులను గుర్తించి మంథనిలో మేర సంఘ భవనానికి 20 లక్షల రూపాయలను కేటాయించడం శుభ పరిణామమని మంథని మేరు సంఘం నాయకులు అన్నారు.మంథని పట్టణంలో మేర కుల సంఘ భవనం నిర్మాణానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు 20 లక్షల రూపాయలను మంజూరు చేశారు. మంత్రి శ్రీధర్ బాబుకు మేర కులస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ శనివారం మంథని పట్టణంలోని బతుకమ్మ చౌక్ వద్ద నుండి అంబేద్కర్ చౌక్ వరకు మహిళలు,పిల్లలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌక్ వద్ద మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి మేర కుల మహిళలు, పురుషులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరు సంఘం నాయకులు మంతెన సాయిచరణ్ (టింకు), మాడిశెట్టి రాజేశ్వర్, మాడిశెట్టి ప్రతాప్, గూడూరి సులోచనలు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మేము కుల సంఘ భవనాన్ని నిర్మించుకుంటామని అన్నారు. కుట్టు మిషన్లతో బట్టలు కుట్టుకుని జీవించే మేము గ్లోబలైజేషన్ లో భాగంగా రెడీమేడ్ దుస్తుల వ్యాపారాల వల్ల ఉపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, మాకు అత్యాధునిక కుట్టు మిషన్ లను, ప్రభుత్వం నుండి రుణాలను అందించి ఆదుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు ద్వారా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, బీసీ సెల్ నాయకులు గోటికారి కిషన్ జీ, ఆయిలి శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంథని సత్యం లు మాట్లాడుతూ మేర కుల సంఘ భవనానికి మంత్రి శ్రీధర్ బాబు రూ. 20 లక్షల నిధులు మంజూరు చేయడంతో సంతోషంతో మేర కుల మహిళలు పురుషులు ఇంత పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించి పాలాభిషేకం చేయడం ఆనందంగా ఉందన్నారు. మేరు కులస్తుల సమస్యలను మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంథని మేర సంఘం నాయకులు పెండ్యాల తిరుమలయ్య, గూడూరి రాజేందర్, రాపర్తి సంతోష్, మాడిశెట్టి రాజేందర్, మంతెన శంకరయ్య, మాడిశెట్టి శ్రీనివాస్, సుదర్శన్, సురేందర్, గూడూరి ధనుంజయ, గట్ల శ్రీకాంత్, మాడిశెట్టి లక్ష్మీనారాయణ, రాయి ప్రకాష్, విష్ణువర్ధన్, మంతెన రాజు, సదానందం, పెండ్యాల రామ్ కుమార్, రాయి వేణుగోపాల్, పెండ్యాల శ్రీధర్, చంద్రశేఖర్, మాడిశెట్టి సంతోష్, నాగార్జున, సాయికిరణ్, పెండ్యాల లిఖిత్, మేరు మహిళలు మాడిశెట్టి లావణ్య, రమాదేవి, విజయలక్ష్మి,సాత్విక,సింధు, పెండ్యాల అనిత, విజయలక్ష్మి, రాయి పద్మావతి, సరిత, గట్ల లక్ష్మి, శ్రీదేవి,గూడూరి గీత,మంతెన తార, శోభా రాణి లతో పాటు అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు ఒకే చోట అన్ని రకాల న్యాయ సేవలు

**తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్**



**మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా ప్రజలకు ఒకే చోట అన్ని రకాల న్యాయస్థాన సేవలు అందించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న న్యాయస్థానం భవన సముదాయ నిర్మాణ కార్యక్రమాన్ని వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా ప్రజలకు అన్ని రకాల న్యాయస్థాన సేవలు ఒకే చోట అందించేందుకు భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.అనంతరం జిల్లాకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి, మంచిర్యాల జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి నగేష్ భీమపాక జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. వీరయ్య జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ డి.సి.పి. ఎ.భాస్కర్ జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్ మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్ న్యాయవాదులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి మంచిర్యాల అడ్మినిస్ట్రేటివ్ జడ్జి మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఒకే చోట జిల్లా స్థాయిలో అన్ని రకాల న్యాయస్థానాల సేవలు అందించేందుకు 81 కోట్ల రూపాయల అంచనా విలువతో భవన నిర్మాణం పనులు ప్రారంభించడం జరిగిందని కోర్టు భవనం శంకుస్థాపన ఇంట్లో పండగల జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. పోక్సో ఫ్యామిలీ కోర్టులను కలుపుకొని 10+2 కోర్టులతో భవన సముదాయాన్ని నిర్మించడం జరుగుతుందని 2027 జూన్ మాసం నాటికి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారత న్యాయ నిర్మాణ వ్యవస్థ ద్వారా 60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్ర బడ్జెట్ నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. గోదావరి నదీ తీరాన కేంద్రీకృతమైన మంచిర్యాల జిల్లాలో వరి పత్తి పంటలు పండుతున్నాయని ఆధ్యాత్మికతకు నెలవైన మంచిర్యాల జిల్లాలో గూడెంలో గల శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి గాంధారి ఖిల్లా వంటి ఆధ్యాత్మిక కేంద్రాలు శివ్వారం మొసళ్ళ అభయారణ్యం సింగరేణి ఆధ్వర్యంలో బొగ్గు త్రవ్వకంతో పాటు విద్యుత్ ఉత్పాదకత కలిగి ఉందని తెలిపారు. ఎస్.సి. ఎస్.టి. కోర్టు వినియోగదారుల ఫోరం ఏర్పాటుకు తగు ప్రతిపాదనలు పంపిస్తే త్వరితగతిన ఏర్పాటు చేసే విధంగా తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. 20 నెలలలో నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. మితిమీరిన స్వార్థం స్వార్థ మనస్తత్వ ధోరణి సమాజంలో అన్ని సమస్యలకు కారణమని ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో తన పని చేసుకుంటూ వెళ్తే ఎలాంటి సమస్యలకు అవకాశం ఉండదని తెలిపారు. శ్రమ ఆయుధమైతే విజయం బానిస అవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణంతో కోర్టు సేవలు ప్రజలకు మరింత అందుబాటులో ఉంటాయని, భవన నిర్మాణ పనులను సంబంధిత గుత్తేదారు నిర్ణీత వ్యవధిలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని తద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. అనంతరం వివిధ న్యాయ సంఘాల ప్రతినిధులు న్యాయవాదుల ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## పీఎన్‌బీ పండుగ ఆఫర్..
## తక్కువ వడ్డీకే కారు లోన్

పండుగ సీజన్ సందర్భంగా కార్లు కొనేవారి కోసం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) తక్కువ వడ్డీకే రుణాలివ్వ నున్నట్టు ప్రకటించింది. ఏడాదికి కేవలం 7.85 శాతం నుంచి ప్రారంభమయ్యే కార్ లోన్ ఆఫర్ చేస్తూ బ్యాంకు వెల్లడించింది. దీంతో ఈ రేటు ప్రభుత్వ రంగ బ్యాంకులలోనే




అత్యంత తక్కువ వడ్డీగా నిలిచింది. ఈ ఆఫర్ అక్టోబర్-డిసెంబర్ మధ్య మాత్రమే చెల్లుబాటు అవుతుందని బ్యాంకు తెలిపింది. అంతేకాకుండా కస్టమర్లకు సున్నా ప్రాసెసింగ్ ఫీజు, ఫ్లోటింగ్-రేటు రుణాలపై ముందస్తు చెల్లింపు లేదా ఫోర్‌క్లోజర్ ఛార్జీల మినహాయింపు, ఎక్కువ కాలం సౌకర్యంగా చెల్లించేలా ఏడేళ్ల వరకు ఈఎంఐ ఆప్షన్ ఉంటుందని బ్యాంకు పేర్కొంది.ముఖ్యంగా పండుగ ఆఫర్ కింద తక్కువ వడ్డీ రేటుతో పాటు బ్యాంకు నో-ఫీ పాలసీ సౌకర్యం ఇవ్వడం వల్ల కస్టమర్లు రూ. వేలాది ఆదా చేసుకోవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. నో-ఫీ పాలసీ అంటే వాహనం కొనే సమయంలో విధించే ప్రాసెసింగ్ ఫీజు వంటి అదనపు ఛార్జీలను తొలగించడం. ఇతర బ్యాంకుల్లో కార్లపై ఇచ్చే రుణాల వడ్డీ రేట్లను గమనిస్తే.. యూకో బ్యాంకు అతి తక్కువగా 7.60 శాతం ప్రారంభ వడ్డీ ఆఫర్ చేస్తోంది. కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 7.70 శాతం నుంచి, ఎస్‌బీఐ 8.8 శాతం నుంచి వడ్డీ ఆఫర్ చేస్తోంది. ప్రైవేట్ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు 9.10 శాతం ప్రారంభ వడ్డీతో రుణాలిస్తున్నాయి.

## శాంసంగ్ నుంచి నయా ఫోన్

శాంసంగ్.... మన ఇండియాలో ఈ బ్రాండ్ కు చాలా మంది అభిమానులు ఉన్నారు. దానికి తగ్గట్టుగానే ఈ కంపెనీ నుంచి రకరకాల మొబైల్ ఫోన్స్ మార్కెట్లోకి లాంచ్ అవుతున్నాయి. ఇలాంటి నేపథ్యంలోనే తాజాగా ఝఎంబఅస్త్ర కంపెనీ నుంచి మరో సరికొత్త సేఫ్టీ మొబైల్ వచ్చింది. శాంసంగ్ ఎం సిరీస్ లో భాగంగా



శాంసంగ్ గెలాక్సీ ఎం 17 5జీ పేరుతో కొత్త స్మార్ట్ ఫోన్ తీసుకువచ్చారు. ఈ మేరకు అధికారిక ప్రకటన కూడా వెలువడింది. అయితే అక్టోబర్ 13వ తేదీ నుంచి విక్రయాలు ప్రారంభం అవుతాయి. రిటైల్ అలాగే ఈ-కామర్స్ లో ఈ మొబైల్ కొనుగోలు చేయవచ్చు. ఈ మొబైల్ ఫీచర్స్ ఒకసారి పరిశీలిస్తే, ఎలాంటి సైబర్ అటాక్స్ జరగకుండా ప్రొటెక్షన్ మొబైల్ కు ఉంటుందని కంపెనీ వెల్లడించింది. అంటే ఆరు సంవత్సరాల పాటు సెక్యూరిటీ అప్డేట్స్ ఇస్తుందట. ఈ మొబైల్ 6.7 అంగుళాల డిస్?ప్లే కలిగి ఉంటుంది. ప్రధాన కెమెరా వచ్చేసి 50 మెగాఫిక్సల్ ఉంటుంది. సెల్ఫీల కోసం 13 ఎంపీ కెమెరా ఇచ్చారు. సఫైర్ బ్లాక్, మూన్ లైట్ సిల్వర్ కలర్లలో ఈ మొబైల్ మార్కెట్ లో లభించనుంది. 4జీబీం128 జీబీ మోడల్ మొబైల్ ధర 12,499 రూపాయలుగా ఫిక్స్ చేశారు. ఇందులో 6జీబీం128జీబీ మొబైల్ ఫోన్ 14,000 రూపాయలుగా ఉంది. 8జీబీం128జీబీ మొబైల్ 15,499 రూపాయలకు అందిస్తున్నారు. అంటే ఈ ఫోన్స్ సామాన్యులు కూడా కొనుగోలు చేసే విధంగా ధరలు ఫైనల్ చేశారు.

# పండుగ సీజన్ సేల్స్‌లో జాగ్రత్త..
# పెరుగుతున్న ఏఐ, డీప్‌ఫేక్ మోసాలు


దేశవ్యాప్తంగా పండుగ సీజన్ వేళ అన్ని ఈ-కామర్స్ కంపెనీ సేల్స్ నిర్వహిస్తున్నాయి. ఇందులో భారీ ఎత్తున ఆఫర్లను కూడా అందిస్తున్నాయి. దీన్ని అదునుగా తీసుకుని చాలామంది సైబర్ నేరగాళ్లు పండుగ సీజన్‌కు ఆన్‌లైన్‌లో కొనేవారిని సులభంగా మోసం చేస్తున్నారు. ఇందుకు ప్రధానంగా వారు ఏఐ, డీప్‌ఫేక్ లాంటి టెక్నాలజీ వాడుతున్నారు. దీపావళి పండుగ సమీపిస్తున్న సమయంలో చాలామంది షాపింగ్ కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగిస్తున్నారు. దీంతో సైబర్ దాడులు కూడా పెరుగుతున్నాయి. దేశంలోని ఆన్‌లైన్ వినియోగదారులలో దాదాపు ముగ్గురిలో ఒకరు ఇలాంటి మోసాల బారిన పడుతున్నారని సైబర్ సెక్యూరిటీ కంపెనీ మెక్‌అఫీ తెలిపింది. మరో 37 శాతం మంది ఆర్థికపరమైన నష్టాలను ఎదుర్కొన్నట్టు చెప్పారని పేర్కొంది. ఈసారి పండుగ సీజన్‌కు స్కామర్‌ల మోసాలు పెరిగాయి. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ, మోసపూరిత ఘటనలు కూడా పెరుగుతున్నాయి. ఏఐ-ఆధారిత స్కామ్‌లు ఆన్‌లైన్ స్టోర్లను నిర్వహించేవారికి కొత్త సవాలుగా మారాయని మెక్‌అఫీ సీనియర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రతిమ్ ముఖర్జీ అన్నారు. దీన్ని అధిగమించేందుకు తరచూ వెబ్‌సైట్‌లను తనిఖీ చేయడం, డివైజ్‌లను సెక్యూర్‌గా ఉంచుకోవడం, అప్రమత్తంగా ఉండటం ద్వారా, సైబర్ దాడుల నుంచి బయటపడగలుగుతున్నామని ఆయన అన్నారు. కస్టమర్లు ఆన్‌లైన్‌లో ఎక్కువ కొనుగోళ్లు చేస్తున్న నేపథ్యంలో సైబర్ మోసగాళ్ళు డీప్‌ఫేక్ సెలబ్రిటీ ఎండార్స్‌మెంట్‌లు, ఫిషింగ్ మేసేజ్‌లు, స్కామ్ ఈ-మెయిల్‌లు, వన్-టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) సహా అధునాతన వ్యూహాలను ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా మొబైల్ ద్వారా




ఆన్‌లైన్ షాపింగ్ పెరుగుతుండటం కూడా సైబర్ మోసాలకు కారణం. 77 శాతం మంది ఇప్పుడు స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా కొనుగోళ్లు చేస్తున్నారు. ముఖ్యంగా 25-44 సంవత్సరాల వయస్సు గల యువ కస్టమర్లు మొత్తం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు ప్రధాన కస్టమర్లుగా ఉన్నారు. గతేడాది కంటే 72 శాతం మంది ఏఐ-ఆధారిత స్కామ్‌ల గురించి ఎక్కువ ఆందోళన చెందుతున్నారు. దాదాపు 91 శాతం మందికి అనుమానాస్పద షాపింగ్ సంబంధిత మెసేజ్‌లు వచ్చాయి, వాటిలో నకిలీ 'గిఫ్ట్ కార్డ్ విన్నర్' పేరుతో (49 శాతం), 'లిమిటెడ్-టైమ్ ఆఫర్లు' (40 శాతం), 'రీఫండ్ నోటిఫికేషన్లు' (27 శాతం) ఉన్నాయి. సగటున, దేశంలోని ప్రజలు రోజుకు 12 స్కామ్ ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. సాధారణ మెసేజ్‌లు, ఫిషింగ్ ఈ-మెయిల్స్, మోసపూరిత సోషల్ మీడియా యాడ్స్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ముఖ్యంగా డీప్‌ఫేక్ సెలబ్రిటీ ఎండార్స్‌మెంట్‌లు, నకిలీ ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లు ఎక్కువ ఆందోళన కలిగిస్తున్నాయి, ఇవి నిజమైనవా కాదా అని తేల్చడం క్లిష్టంగా మారిందని మెక్‌అఫీ నివేదిక పేర్కొంది.

# భారత కుటుంబాల వద్ద 3.8 ట్రిలియన్ డాలర్ల బంగారం

భారతీయ కుటుంబాల ఆర్థిక శక్తికి బంగారం ఎంతటి కీలకమో ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ విడుదల చేసిన తాజా నివేదిక స్పష్టం చేసింది. దేశంలోని ఇళ్లలో ఉన్న పసిడి నిల్వల విలువ ఏకంగా 3.8 ట్రిలియన్ డాలర్లని, ఇది దేశ స్థూల జాతీయోత్పత్తిలో (జీడీపీ) 88.8 శాతానికి సమానమని ఈ నివేదిక అంచనా వేసింది. ప్రస్తుతం బంగారం ధరలు ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయికి చేరడంతో, కుటుంబాల సంపదపై ఇది సానుకూల ప్రభావం చూపుతోందని శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదికలో పేర్కొంది.ప్రస్తుతం బంగారం ధరలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 4,056 డాలర్ల వద్ద ఉండగా, దేశీయంగా 10 గ్రాముల పసిడి ధర సుమారు రూ. 1,27,300 పలుకుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు డాలర్లలో బంగారం ధర 54.6 శాతం పెరగ్గా, రూపాయిలలో 61.8 శాతం పెరిగినట్లు నివేదిక వివరించింది.ప్రపంచంలో బంగారం వినియోగంలో చైనా (28%) మొదటి స్థానంలో



ఉండగా, భారత్ (26%) రెండో స్థానంలో కొనసాగుతోంది. దేశంలో బంగారం డిమాండ్‌లో ఎక్కువ భాగం గృహ వినియోగం నుంచే వస్తోంది. అయితే, ఇటీవలి కాలంలో పెట్టుబడి మార్గాలు కూడా మారుతున్నాయి. భౌతిక బంగారం కాకుండా, ఈటీఎఫ్‌ల వంటి ఆర్థిక ఆస్తుల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, గత 12 నెలల్లో ఈటీఎఫ్‌లలోకి 1.8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని నివేదిక తెలిపింది.మరోవైపు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా తన పసిడి నిల్వలను పెంచుకుంటోంది. 2024 నుంచి ఆర్బీఐ సుమారు 75 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. దీంతో ఆర్బీఐ వద్ద ఉన్న మొత్తం బంగారం నిల్వలు 880 టన్నులకు చేరాయి. ఇది దేశ మొత్తం విదేశీ మారక నిల్వల్లో 14 శాతానికి సమానం.దేశంలో స్థూల ఆర్థిక స్థిరత్వం కారణంగా బంగారం దిగుమతులు అదుపులోనే ఉన్నాయని మోర్గాన్ స్టాన్లీ విశ్లేషించింది. ద్రవ్యోల్బణం సగటున 5 శాతంగా ఉండటం, సానుకూల వడ్డీ రేట్లు కొనసాగడం వల్ల ప్రజలు భౌతిక ఆస్తులపై అధికంగా ఆధారపడటం లేదని పేర్కొంది. ప్రస్తుతం బంగారం దిగుమతులు జీడీపీలో 1-1.5 శాతం మధ్య ఉండగా, 2013 మే నెలలో ఇది రికార్డు స్థాయిలో 3.3 శాతంగా ఉండేది. ఈ స్థిరత్వం కరెంట్ ఖాతా లోటుపై ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడిందని నివేదిక ముగించింది.

# గిల్ శతక జోరు, జడ్డూ వికెట్ల వేట..
# రెండో టెస్టులో పట్టుబిగించిన భారత్

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భారత జట్టు చెలరేగిపోతోంది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ విజయంతో వెస్టిండీస్‌కు షాకిచ్చిన టీమిండియా రెండో టెస్టులోనూ పట్టుబిగించింది. అరుణ్‌జైట్లీ స్టేడియంలో శుభ్‌మన్ గిల్ సెంచరీతో భారీ స్కోర్ అందిస్తే.. ఆ తర్వాత రవీంద్ర జడేజా వికెట్ల వేటతో విండీస్‌కు దడపుట్టించాడు. జడ్డూ విజృంభణతో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన కరీబియన్ టీమ్.. రెండో రోజు ఆట ముగిసే సరికి 4 వికెట్ల నష్టానికి 140 రన్స్ చేసింది. ఇంకా 378 పరుగుల లోటుతో ఉంది పర్యాటక జట్టు. ఢిల్లీ టెస్టులోనూ భారత జట్టు జోరు చూపిస్తోంది. టాపార్డర్ మెరుపులతో భారీ స్కోర్ చేసిన టీమిండియా అనంతరం వెస్టిండీస్ భరతం పడుతోంది. తొలి ఇన్నింగ్స్‌ను శుభ్‌మన్ గిల్ సేన డిక్లేర్ చేశాక బ్యాటింగ్‌కు దిగిన పర్యాటక జట్టుకు ఓపెనర్లు శుభారంభం ఇవ్వలేకపోయారు. సిరాజ్, బుమ్రా బౌలింగ్‌లో వికెట్ కాపాడుకున్న జాన్ క్యాంప్‌బెల్ (10) స్పిన్నర్ జడేజా ఓవర్లో స్వీప్‌షాట్ ఆడి వికెట్ పారేసుకున్నాడు. సుదర్శన్ చక్కగా అందుకోవడంతో అతడు నిరాశగా పెవిలియన్ చేరాడు. తగ్‌నరైన్ చందర్‌పాల్(34), అలిక్ అథనజే (41)లు కాసేపు ప్రతిఘటించి విండీస్‌ను ఆదుకునేలా కనిపించారు. కానీ, జడ్డూ తన మ్యాజిక్



చూపించగా చందర్‌పాల్‌ను స్లిప్‌లో రాహుల్ చేతికి చిక్కాడు. దాంతో, రెండో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యానికి తెరపడగా.. 87 పరుగులకే రెండో వికెట్ పడింది. క్రీజులో కుదురుకున్న అథనెజేను కుల్దీప్ ఔట్ చేయగా.. రోస్టన్ ఛేజ్(0)ను రిటర్న్ క్యాచ్‌తో జడ్డూ డగౌట్ చేర్చాడు. అంతే.. 107కే నాలుగు వికెట్లు పడడంతో మరోసారి ఆలౌట్ ప్రమాదంలో పడింది విండీస్. అయితే..రు షాయ్ హెూప్ (31 నాటౌట్), టెవిన్ ఇమ్లెచ్ (14 నాటౌట్) ఆచితూచి ఆడుతూ వికెట్ కాపాడుకున్నారు. దాంతో.. రెండో రోజు ఆట ముగిసే సరికి విండీస్ 4 వికెట్లు కోల్పోయి140 రన్స్ చేసింది. ఈ ఇద్దరిని మూడో రోజు త్వరగా వెనక్కి పంపితే తొలి సెషన్‌లోనే కరీబియన్ జట్టు కుప్పకూలడం ఖాయం.

### గిల్, జురెల్ దంచేయగా

తొలి రోజు ఓపెనర్లు కేఎల్ రాహుల్(38), యశస్వీ జైస్వాల్(175) శుభారంభంతో గట్టి పునాది వేయగా.. యశస్వీ శతకంతో రెచ్చిపోయాడు. మూడో స్థానంలో కుదురుకున్న సాయి సుదర్శన్ (87) అర్ధ శతకంతో చెలరేగడంతో మొదటి రోజే భారీ స్కోర్ చేసిన భారత్.. రెండో రోజు తొలి సెషన్ మొదలైన కాసేపటికే యశస్వీ వికెట్ కోల్పోయింది. మూడో డబుల్ సెంచరీ కొట్టాలనుకున్న యశస్వీ.. సారథి శుభ్‌మన్ గిల్(129 నాటౌట్)తో సమన్వయం లోపంలో రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత నితీశ్ కుమార్ రెడ్డి (43) జతగా తనదైన షాట్లతో అలరించిన గిల్ జట్టు స్కోర్ బోర్డును 400 దాటించాడు. నితీశ్ వెనుదిరిగాక.. ధ్రువ్ జురెల్(44)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. గ్రీవ్స్ ఓవర్ల సిక్సర్‌తో దూకుడు పెంచిన గిల్.. కెరీర్లో శతకం సాధించాడు. ఆ తర్వాత మరింత రెచ్చిపోయిన గిల్ సిక్స్, ఫోర్లతో విండీస్ బౌలర్లను వణికించాడు. అయితే.. రోస్టన్ ఛేజ్ ఓవర్లో జురెల్ బౌల్డ్ కావడంతో 518/5 వద్ద టీమిండియా ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

## ఇదొక ఊహించని పరిణామం..
## తప్పు అతడిదే: కుంబ్లే

టెస్టుల్లో ఇప్పటికే రెండు డబుల్ సెంచరీలు సాధించాడు టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ వెస్టిండీస్‌తో రెండో టెస్టు సందర్భంగా ముచ్చటగా మూడోది పూర్తి చేస్తాడనుకుంటే ఊహించని రీతిలో రనౌట్ అయ్యాడు. ఢిల్లీలో శనివారం నాటి రెండో రోజు ఆట సందర్భంగా.. అనవసరపు పరుగు కోసం యత్నించి జైసూ మూల్యం చెల్లించాడు. 175 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రనౌట్ అయి డబుల్ సెంచరీకి 25 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. టీమిండియా తొలి ఇన్నింగ్స్ 92వ ఓవర్లో ఈ ఘటన జరిగింది. జేడన్ సీల్స్ బౌలింగ్‌లో బంతిని మిడాఫ్ దిశగా జైసూ బంతిని బాదగా.. అది నేరుగా ఫీల్డర్ దగ్గరకు వెళ్లింది. అయితే అప్పటికే పరుగు కోసం క్రీజు వీడిన జైస్వాల్.. మరో ఎండ్‌లో ఉన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు పిలుపునిచ్చాడు. కానీ ఫీల్డర్ చేతికి బంతి చిక్కడంతో జాగ్రత్త పడ్డ గిల్ కాస్త ముందుకు కదిలినా మళ్లీ తన స్థానంలోకి వచ్చేశాడు. ఇంతలో జైసూ వెనక్కి పరిగెత్తగా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ నేపథ్యంలో జైసూ- గిల్ తీరుపై విమర్శలు వస్తుండగా.. టీమిండియా



మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే మాత్రం గిల్‌కు మద్దతుగా నిలిచాడు. స్వీయ తప్పిదంతోనే జైస్వాల్ వికెట్ పారేసుకున్నాడని అభిప్రాయపడ్డాడు. "ఇదొక ఊహించని పరిణామం. జైస్వాల్ వంటి ప్రతిభావంతమైన ఆటగాడు ఇలా చేస్తాడని ఎవరైనా అనుకుంటారా?.. తన షాట్ బాగానే ఆడానని జైస్వాల్ భావించి ఉంటాడు. ఏదేమైనా పరుగుకోసం వెళ్లాలనేది జైస్వాల్ నిర్ణయం.

### తప్పంతా అతడిదే

ఇందులో నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న ఆటగాడి (గిల్) తప్పేమీ లేదు. ఎందుకంటే జైసూ మిడాఫ్ ఫీల్డర్‌కు నేరుగా బంతిని అందించినట్లయింది. ఆ సమయంలో పరుగుకు తీయడానికి అసలు అవకాశమే లేదు" అని స్టార్ స్పోర్ట్స్ షోలో కుంబ్లే పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే.. రెండో రోజు ఐదు వికెట్ల నష్టానికి 518 పరుగుల వద్ద ఉన్న వేళ టీమిండియా తమ తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. గిల్ 196 బంతులు ఎదుర్కొని 16 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 129 పరుగులతో అజేయంగా నిలిచాడు.

# స్పోర్ట్స్

## గిల్‌కు అప్పుడదే చెప్పాం.. కోచ్‌గా
## ఆ ఓటమిని ఎన్నటికీ మర్చిపోలేను

ఇంటర్నెట్ డెస్క్: భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌లను అందించాడు. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను డ్రాగా ముగించాడు. కానీ, కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో వరుసగా ఓటములను చవిచూశాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌ను కోల్పోవడాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని గౌతమ్ గంభీర్ తెలిపాడు. వెస్టిండీస్‌తో



రెండో టెస్టు సందర్భంగా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రాతో గంభీర్ మాట్లాడాడు. ఆ వీడియోను విండీస్‌తో రెండో టెస్టు రెండో రోజు లంచ్ బ్రేక్ సమయంలో క్రీడా ఛానల్ ప్రసారం చేసింది. "ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా మారాలనుకుంటే.. కేవలం స్వదేశంలో గెలిస్తేనే సరిపోదు. విదేశాల్లోనూ సత్తా చాటడం అత్యంత ముఖ్యం. ఇప్పుడీ యువ జట్టు చూపించే తెగువ అదే. ఇంగ్లాండ్ జట్టు మనకు అత్యంత కఠినమైన సవాల్ విసిరే టీమ్. అక్కడికి పెద్దగా అనుభవం లేని జట్టుతో వెళ్లాం. అద్భుతమైన ప్రదర్శనతో తిరిగి వచ్చాం. ఇక్కడ కేవలం రిజల్ట్స్‌ను మాత్రమే చూడకూడదు. ఎలాంటి పోరాటం చేశామనేది అత్యంత కీలకం. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే కేవలం స్వదేశంలోనే గెలిస్తేనే సరిపోతుందని నేను భావించను. ఇక్కడే విజయాలు సాధిస్తే వరల్డ్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలవలేరు" అని గంభీర్ తెలిపాడు.

### మరిచిపోవడం కష్టమే..

"నా కోచింగ్ కెరీర్ ముగిసినా సరే.. జీవితాంతం న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను మరిచిపోలేను. ఇదే విషయాన్ని మా కుర్రాళ్లకూ చెప్పా. దానిని వదిలేసి ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అలాగే గతాన్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. అలా చేయకపోతే దేనినైనా తేలికగా తీసుకొనే అవకాశం ఉంటుంది. క్రీడల్లో ఇవన్నీ సహజమే. ప్రతి ఒక్కరూ ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనే ఉంటారు. నేను డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా ఆటగాళ్లకు ఎప్పుడూ న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌లో ఏం జరిగిందో చెబుతూ ఉంటా. ప్రత్యర్థికి ఏమాత్రం ఛాన్స్ ఇవ్వకూడదనేది నా భావన" అని గంభీర్ వ్యాఖ్యానించాడు.

### మద్దతు ఇస్తూనే ఉంటా

"యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఎప్పుడూ మద్దతుగా నిలుస్తా. అతడిని 25 ఏళ్ల వయసులోనే టెస్టు సారథిగా చేసినప్పుడు ఒకటే చెప్పాం. 'మేం నిన్ను లోతైన సముద్రంలోకి నెట్టాం. రెండే మార్గాలు ఉంటాయి. పైకి వచ్చి గొప్ప స్విమ్మర్ కావడమా? లేదా మునిగిపోవడమా? సారథిగా తొలి టెస్టు సిరీస్‌లోనే 750ం పరుగులు చేయడం కంటే ఆ ఒత్తిడిని తట్టుకొని జట్టును నడిపించిన తీరే నాకు నచ్చింది. అంతకంటే కఠినమైన టెస్టు సిరీస్‌ను తన జీవితంలో ఎదుర్కొని ఉండకపోవచ్చు. సారథిగా పదేళ్లు, 15 ఏళ్లు లేదా రెండేళ్లా అనేది పక్కన పెడితే.. ఇంగ్లాండ్‌తో రెండు నెలలను చాలా చక్కగా హ్యాండిల్ చేశాడు. ఓవల్ టెస్టు తర్వాత అతడితో మాట్లాడుతూ 'నువ్వు కఠినమైన టెస్టులో పాస్ అయ్యావు. ఇక నుంచి అంతా సులువుగానే మారిపోతుంది' అని చెప్పా.



# ఒకే నెలలో మూడు సినిమాలు

## కృతిశెట్టి మళ్లీ ట్రాక్‌పైకి వచ్చేనా?

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. మరి చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.



## ఫన్నీగా 'కె ర్యాంప్' ట్రైలర్

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా నటించిన సినిమా 'కె ర్యాంప్'. దీపావళి కానుకగా ఈ నెల 18న థియేటర్లలోకి మూవీ రానుంది. ఇప్పటికే ప్రమోషన్లలో టీమ్ బిజీగా ఉంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇది ఫన్నీగా ఉంటూనే ఆకట్టుకునేలా ఉంది. టీజర్ విడుదలైనప్పుడు లిప్ కిస్సులు, బూతుల గురించి కాస్త నెగిటివిటీ వచ్చింది. దీంతో ఈసారి ట్రైలర్?లో ఆ డోస్ తగ్గించినట్లే కనిపించారు. రెండు మూడు చోట్ల మాత్రం కిస్సులు, డబుల్ మీనింగ్ బూతులు వినిపించాయి. ట్రైలర్ బట్టి చూస్తే.. కుమార్ అనే కుర్రాడికి తండ్రి మాత్రమే ఉంటాడు. దీంతో అల్లరిచిల్లరగా తిరుగుతూ మందు తాగుతూ బతికేస్తుంటాడు. అయితే చదువుకునేందుకు కేరళలోని కొచ్చి వెళ్తాడు. అక్కడ ఓ అమ్మాయిని చూసి ఇష్టపడతాడు. ఇబ్బంది పెట్టి మరీ ఆమె తనని ప్రేమించేలా చేస్తాడు. కుమారే అనుకుంటే ఆమెకు సైకలాజికల్ ప్రాబమ్స్ ఉంటాయి. దీంతో తిక్కతిక్కగా ప్రవరిస్తుంది. చివరకు ఈ జంట ఒక్కటైందా లేదా అనేది స్టోరీలా అనిపిస్తుంది. చాన్నాళ్లుగా కిరణ్ అబ్బవరం సినిమాలు చేస్తున్నాడు. కానీ గతేడాది దీపావళికి రిలీజైన 'క' చిత్రం మాత్రమే హిట్ అయింది. ఈ ఏడాది మార్చిలో 'దిల్ రుబా' అనే మూవీతో వచ్చాడు. ఇది ఘోరంగా ఫ్లాప్ అయింది. దీంతో యూత్?ని టార్గెట్ చేసి 'కె ర్యాంప్' తీశాడు. మరి ఇది ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి? దీపావళికి దీనితో పాటు మిత్రమండలి, తెలుసు కదా, డ్యూడ్ సినిమాలు కూడా రిలీజ్ కాబోతున్నాయి.

## డార్క్ చాక్లెట్ మూవీ.. పెద్దలకు మాత్రమే



రీసెంట్ టైంలో సినిమాల్లో వైల్డ్‌నెస్ పేరిట బూతుల్ని, బూతు సన్నివేశాల్ని అక్కడక్కడ ఉపయోగిస్తున్నారు. కొన్నింటికి సెన్సార్ కత్తటర వేస్తున్నప్పటికీ మరికొన్నిసార్లు మాత్రం మూవీకి 'ఏ' సర్టిఫికెట్ లాంటివి తెచ్చుకుని రిలీజ్ చేస్తున్నారు. వీటిని యూత్ చూస్తారు. ఫ్యామిలీ ఆడియెన్స్ కాస్త దూరంగానే ఉంటారు. సరే ఇదంతా పక్కనబెడితే రానా నిర్మాతగా 'డార్క్ చాక్లెట్' అనే మూవీ త్వరలో రాబోతుంది. దీని టీజర్ ఇప్పుడు రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే.. యజ్ఞ అనే హీరో, ఓ ముగ్గురు వ్యక్తుల(ఓ మహిళ, ఇద్దరు పురుషులు) మధ్య జరిగే కథే ఈ సినిమా స్టోరీలా అనిపిస్తుంది. అయితే టీజర్ బూతు సన్నివేశాలేం లేవు గానీ బూతు మాటలు మాత్రం కాస్త గట్టిగానే వినిపించాయి. అయితే వీటిని టీజర్ కోసమే పెట్టారా? నిజంగా మూవీలోనూ ఉంచుతారా అనేది చూడాలి? అయితే హీరో రానా నిర్మాతగా ఈ తరహా మూవీ వస్తుందని అస్సలు ఊహించలేదు. '35' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న విశ్వదేవ్ ఇందులో హీరో కాగా బిందుమాధవి హీరోయిన్. మరో ఇద్దరు కూడా తెలుగు నటులే. 'కిడ్స్ పక్కకెళ్లి ఆడుకోండి' ,'పాన్ మసాలా మూవీ', 'జానర్ అడగొద్దు' లాంటి క్యాప్షన్స్ చూస్తుంటే కాస్త ఆసక్తికరంగానే అనిపిస్తుంది. అలానే రిలీజ్ ఎప్పుడనేది కూడా అక్టోబరు 31, నవంబరు 14, డిసెంబరు 5 అని మూడు తేదీలు ప్రకటించి, మనల్నే ఎంచుకోమన్నట్లు చూపించారు. శశాంక్ శ్రీ వాస్తవ్య దర్శకుడు కాగా వివేక్ సాగర్ సంగీతమందించాడు. చూస్తుంటే ఇది పెద్దల కోసం మాత్రమే తీసిన సినిమాలా అనిపిస్తుంది.



# నేషనల్ క్రష్‌గా రష్మిక ఔట్.. ఇంటర్నేషనల్ క్రష్ గా మరో కన్నడ బ్యూటీ..!

కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన మరో స్టార్ హీరోయిన్ ఇప్పుడు తన హవా చాటుతుంది. 'సప్త సాగరదాచె ఎల్లో' సినిమాతో పరిచయమై, 'కాంతార ఛాప్టర్ 1'లో కనకవతి పాత్రలో నటించిన రుక్మిణి వసంత్ ఇప్పుడు నేషనల్ స్థాయిని దాటి ఇంటర్నేషనల్ క్రష్‌గా మారిపోయారు. 'కాంతార ఛాప్టర్ 1' బ్లాక్‌బస్టర్ విజయంతో ఆమె పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. హొంబాలే ఫిల్మ్స్ నిర్మించిన కాంతార చాప్టర్ 1 చిత్రం విడుదలైన వారం రోజుల్లోనే రూ. 500 కోట్లకు పైగా వసూలు చేసి సంచలనం సృష్టించింది. కన్నడ సినిమా రంగంలో ఇదొక అరుదైన రికార్డు. అద్భుతమైన కథ, దృశ్యకావ్యం లాంటి విజువల్స్‌తో పాటు, రుక్మిణి వసంత్ నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు 'నేషనల్ క్రష్'గా రష్మిక మందన్న పేరు వినిపిస్తుండగా, ఇప్పుడు ఆ స్థానం రుక్మిణికి చెందిందని నెటిజన్లు భావిస్తున్నారు. సోషల్ మీడియాలో ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇక ఆమెను కర్ణాటక క్రష్, కన్నడ క్రష్, ఇంటర్నేషనల్ క్రష్ అంటూ పిలుస్తున్నారు. రష్మిక మందన్నపై ఇటీవల కన్నడ ప్రేక్షకుల్లో కొంత వ్యతిరేకత నెలకొన్న సంగతి తెలిసిందే. అదే సమయంలో రుక్మిణి వసంత్ 'కాంతార 2' విజయంతో వెలుగులోకి రాగా ఆమెను రష్మికకు బదులుగా ప్రొజెక్ట్ చేస్తున్నారు. ఇక రష్మిక, విజయ్ దేవరకొండ ఎంగేజ్‌మెంట్ చేసుకోబోతున్నారన్న వార్తల నడుమ, ఆమె వెనుకబడతుందన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం రుక్మిణి వసంత్ తమిళ, కన్నడ సినిమాలతో బిజీగా ఉన్నారు. త్వరలోనే తెలుగులోనూ ఎంట్రీ ఇవ్వనున్నట్టు సమాచారం. 'కాంతార 2 ' విజయంతో ఆమె కెరీర్‌లో కొత్త అధ్యాయం మొదలైందనడంలో సందేహమే లేదు. ఇక రష్మిక మందన్న స్థాయిని రుక్మిణి వసంత్ చేరతారా? లేక ఈ క్రేజ్ తాత్కాలికమా? అన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే. కాగా రష్మిక మందన్నా క్రేజ్ ఇప్పుడు ఏమి తగ్గలేదు. ఆమెకి వరుస ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. చేసిన ప్రతి సినిమా కూడా మంచి విజయం సాధిస్తూనే ఉంది. మరి రష్మిక, రుక్మిణి ఫైట్‌లో గెలుపెవరిదో చూడాలి.




# పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తున్న అరి

'పేపర్ బాయ్' లాంటి సున్నితమైన ప్రేమ కథతో అందరినీ మెప్పించిన దర్శకుడు 'అరి' అంటూ ఈ వారం ఆడియెన్స్ ముందుకు వచ్చాడు. నిన్న (అక్టోబర్ 10) విడుదలైన ఈ చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. మీడియా నుంచి సోషల్ మీడియా వరకు ఆడియెన్స్ నుంచి మౌత్ టాక్ ఇలా అన్నీ కూడా పాజిటివ్‌గానే ఉన్నాయి. ఈ వారం వచ్చిన చిత్రాలన్నింట్లోనూ అరి కాస్త ముందు వరుసలో ఉందని చెప్పుకోవచ్చు. అరికి మంచి ప్రశంసలు లభించడం, ఆదరణ దక్కుతుండటంతో టీంలో కొత్త ఉత్తేజం వచ్చినట్టుగా కనిపిస్తోంది. ఇక 'అరి' సక్సెస్ సాధించడంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం దర్శకుడు జయశంకర్‌ను అభినందించారు. ఏడేళ్ల శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కిందని కొనియాడారు. అరి విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం అరి చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల్ని ఆకట్టుకుంటోంది. ఇక అరి చిత్రంలోని కథ, కథనం, ఇచ్చిన సందేశం ఆడియెన్స్‌ను మెప్పిస్తోంది. 'అరి' చిత్రానికి అనూప్ రూబెన్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విజువల్స్ పరంగానూ మంచి పేరు వచ్చింది. మొత్తానికి అరితో దర్శకుడు జయశంకర్ ద్వితీయ విఘ్నం దాటినట్టుగా చెప్పుకోవచ్చు. అరి సినిమాలోని మాటలు, పాటలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. సినిమా ప్రారంభం నుండి ముగింపు వరకూ ఓ ట్రాన్స్ లో డైరెక్టర్ జయశంకర్ సీన్ టు సీన్ తీసుకుంటూ వెళ్ళిపోయారని చూసిన ఆడియెన్స్ మెచ్చుకుంటున్నారు. ఈ చిత్రంలో వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ పాత్రలకు అందరూ కనెక్ట్ అవుతున్నారు.